RNI APTEL/25/A0798

# టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

సంపుటి : 1 | సంచిక: 1 | 19-6-2025 గురువారం | ఎడిటర్ :మఱ్ఱి పవీన్ | పేజీలు : 8 | వెల 4 /-

## లోకేష్‌ను అభినందించిన అమిత్ షా..



న్యూఢిల్లీ , జూన్ 18: మంత్రి నారా లోకేష్ ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. ఈరోజు మధ్యాహ్నం కేంద్ర హెూంమంత్రి అమిత్ షాతో మంత్రి సమావేశమయ్యారు. దాదాపు 25 నిమిషాల పాటు కేంద్రమంత్రితో లోకేష్ చర్చించారు. ఇందులో భాగంగా ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, కేంద్ర సహకారంతో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతి, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను కేంద్రమంత్రికి లోకేష్ వివరించారు. ఈనెల 21న విశాఖలో ప్రధాని మోదీ హాజరయ్యే యోగాంధ్ర కార్యక్రమానికి విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.రాష్ట్రంలో అమలవుతున్న ప్రాజెక్టుల పురోగతిని వివరిస్తూ కొత్తప్రాజెక్టులకు కేంద్రం సహకారం అందించాలని కోరారు. యువగళం పాదయాత్ర అనుభవాలతో రూపొందించిన యువగళం పుస్తకాన్ని అమిత్ షాకు అందజేశారు. సుదీర్ఘ పాదయాత్రతో ప్రజల్లో చైతన్యాన్ని నింపిన లోకేష్‌ను అమిత్ షా ప్రత్యేకంగా అభినందించారు. చంద్రబాబు సుదీర్ఘ పాలన అనుభవం ఏపీని అభివృద్ధి బాటలో నడిపిస్తుందని, ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్‌కు కేంద్ర సహకారం కొనసాగుతుందని అమిత్ షా భరోసా ఇచ్చారు. అనంతరం ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్‌తో మంత్రి సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

# ఆదాయం వృద్ధి గణనీయంగా పెంచే దిశలో కీలక కార్యాచరణ



జూన్ 18: రాష్ట్రంలో ఆదాయం వృద్ధి గణనీయంగా పెంచే దిశలో కీలక కార్యచరణ చేపట్టినట్లు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. జాతీయవృద్ధితో పోల్చుకుంటే ఇప్పటికే మన గ్రోత్ ఐదున్నర 15 శాతం వృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిం చాలన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి అనుగు ణంగా అభివృద్ధి ప్రణాళికలు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, జీఎస్డీపీ అంచనాలు, అభివృద్ధి సూచికలు, గ్రోత్ డ్రైవర్స్ వంటి అంశాలపై చంద్రబాబు అధికారులతో చర్చించారు. ప్రణాళిక శాఖ దృష్టి సారించాల్సిన అంశాలపై ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. రుణాలు తగ్గించుకోవడం, సంక్షేమానికి వనరులు సమకూర్చుకోవడం వంటివి అత్యంత కీలక అంశాలని చంద్రబాబు వివరించారు. వనరుల సమీకరణలో రాష్ట్ర సొంత ఆదాయం, కేంద్రం నుంచి వచ్చే నిధులతో పాటు కొత్త మార్గాలను అన్వేషించాలని సూచించారు. వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రణాళిక శాఖ పని చేయాలని ఆదేశించారు. ఆదాయం వృద్ధి గణనీయంగా పెంచే దిశలో కీలక కార్యాచరణ

**ఆర్థిక పరిస్థితిపై సమగ్ర సమీక్ష**

ఈ విషయంలో ప్రభుత్వం నిర్ణయాలు తీసుకునేందుకు అవసరమైన ప్రామాణిక సమాచారాన్ని రూపొందించుకోవాలన్నారు. ఈ దిశగా ప్రణాళిక పనితీరు మెరుగు పరుచుకోవాలని చంద్రబాబు చెప్పారు. పెట్టుబడులను ఆకర్షించే విషయంలో ఏపీ బ్రాండ్ ప్రమోషన్ నిరంతరం జరగాలని స్పష్టం చేశారు. ఇప్పటికే 25 కెబినెట్ సమావేశాలు, 25 ఎస్ఐపీబీ సమావే శాలు నిర్వహించి.. పెద్ద ఎత్తున పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చామని గుర్తు చేశారు. ఇక్కడితో ఆగకుండా.. ఆ ప్రాజెక్టులు ప్రారంభమయ్యేలా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఏపీ సచివాలయంలో ప్లానింగ్ శాఖ ఏపీ ఎకానమీ, గ్రోత్ డ్రైవర్స్, జీఎస్డీపీ ప్రొజెక్షన్స్, కీ పెర్ఫామెన్స్ ఇండికేటర్లపై సీఎం చంద్రబాబు సమీక్షను నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన అధికారు లకు పలు సూచనలు చేస్తూ 2024- 25 ఆర్థిక సంవత్సరంలో జాతీయ స్థాయికిమించి ఏపీ తలసరి ఆదాయం పెరిగిందన్నారు. ఈ మేరకు అధికారులు తమ నివేదికలో వివరిం చారన్నారు. దీనిపై వారి నుంచి స్పష్టతను సీఎం చంద్రబాబు కోరారు. 2024- 25కు జాతీయ స్థాయిలో సరాసరి తలసరి ఆదాయం 8.7 శాతంగా ఉంటే.. ఏపీ 11.89 శాతం నమోదు చేసిందని తెలిపిన అధికారులు సీఎం చంద్ర బాబుకు వివరించారు, ఇది సంతృప్తికర అంశమైనప్పటికి మరింతగా తలసరి ఆదాయం, జీఎస్డీపీ, రాష్ట్రాదా యాలు ఎలా పెరుగుతాయనే అంశంపై మనం దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు అన్నారు. అందుకు తగినట్లు అంచనాలు రూపొందించాలని సీఎం చంద్రబాబు అన్నారు.

# గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్‌ను ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి




తెలంగాణ, జూన్ 18: తెలంగాణలో డిజిటల్ రంగ అభివృద్ధికి మరో కీలక కార్యక్రమం హైదరాబాద్‌లో బుధవారం జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైటెక్ సిటీలో గూగుల్ సంస్థ ఏర్పాటు చేసిన 'గూగుల్ సెక్యూరిటీ ఇంజినీరింగ్ సెంటర్' ను ప్రారంభించారు. ఈ సెంటర్ 2 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించబడగా, అదే ప్రాంతంలో ఇందిరా మహిళా శక్తి సెంటర్ను మూడున్నర ఎకరాల్లో ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ మహిళలు గూగుల్‌కు గట్టి పోటీ అని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. బుధవారం హైదరాబాద్‌లో గూగుల్ సంస్థ ఏర్పాటు చేసిన సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను (జీఎస్ఈసీ) ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రపంచం వేగంగా డిజిటల్ యుగం వైపు పయనిస్తోందని, ఈ నేపథ్యంలో డిజిటల్ సమాచార భద్రత ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రజల డిజిటల్ సమాచారం సురక్షితంగా ఉన్నప్పుడే వారు క్షేమంగా ఉన్నట్లు భావించాలని ఆయన అభిప్రాయపడ్డారు.

**ఇన్నోవేటివ్ కంపెనీ**

హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను ప్రారంభించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. డిజిటల్ భద్రతను పెంపొందించడమే ఈ కేంద్రం యొక్క ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.గూగుల్ ఒక ఇన్నోవేటివ్ కంపెనీ, మా ప్రభుత్వం కూడా ఇన్నోవేటివ్‌గానే పని చేస్తుంది. రాష్ట్రంలో యువత నైపుణ్యాలను పెంచేందుకు ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం" అని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు ఉత్తమ గమ్యస్థానంగా మారుతోందని, అందుకు తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలే కారణమని వివరించారు.

**ఆర్థిక వ్యవస్థ**

రాష్ట్ర ఆర్థిక ప్రగతి లక్ష్యాలను కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రస్తావించారు. "2035 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం'' అని ఆయన పేర్కొన్నారు. 'తెలంగాణ రైజింగ్' కార్యక్రమం లో భాగంగా రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని వెల్లడించారు. "ఇక్కడి మహిళలు కేవలం లబ్ధిదారులుగా మిగిలిపోకుండా, ధనిక పెట్టుబడిదారులకు దీటైన పోటీదారులుగా ఎదుగుతున్నారు. ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణలు, వినూత్న విధానాలు తీసుకొస్తున్నాం'' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.

## విశాఖలో భారీగా ట్రాఫిక్ జామ్



విశాఖ, జూన్ 18: : విశాఖలో 21న అంతర్జాతీయ యోగ డే వేడుకల ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. దీంతో విశాఖలోని హనుమంతవాక జంక్షన్ వద్ద పెద్దయేత్తున వాహనాలు నిలిచిపోయాయి. దీంతో భారీగా ట్రాఫిక్ జాం అయింది. వాహనాలు ఎక్కడిక్కడ నిలిచిపోయి వాహనదారులు అనేక ఇబ్బందులు

## ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్‌తో మంత్రి లోకేష్ భేటీ




ఢిల్లీ జూన్ 18: దేశ రాజధాని ఢిల్లీ లో ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బిజీ బిజీగా గడుపుతున్నారు. బుధవారం ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ తో లోకేష్ భేటీ అయ్యారు. సుమారు గంటసేపు ఉపరాష్ట్రపతితో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సాధించిన విజయాలు, అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఉపరాష్ట్రపతికి మంత్రి లోకేష్ వివరించారు. మరింత వేగవంతమైన అభివృద్ధికి సహాయ, సహకారాలను అందించాలని జగదీప్ ధన్కడ్‌ను కోరారు.

## ఏపీ ప్రజలకు డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా హెచ్చరిక




జూన్ 18: సైబర్ మోసాలు రోజురోజుకీ పెరిగిపోతున్న నేపథ్యంలో, రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) హరీష్ కుమార్ గుప్తా ప్రజలను కీలకంగా హెచ్చరించారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్లకు వచ్చే సందేశాల్లోని అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా ' రూపంలో వచ్చే లింక్‌లపై క్లిక్ చేయొద్దని పేర్కొన్నారు.కొందరు సైబర్ నేరగాళ్లు కొద్దిరోజులుగా పీఎం కిసాన్ యోజన, ఎస్‌బీఐ ఈకేవైసీ, ఐసీఐసీఐ బ్యాంకు క్రెడిట్ కార్డు పేర్లతో మోసపూరిత లింక్స్ పంపిస్తున్నారన్నారు. ఆ ఏపీకే ఫైల్స్ లింక్‌లపై క్లిక్ చేస్తే వ్యక్తిగత సమాచారం సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళుతుందంటున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీ డీజీపీ హరీష్‌కుమార్ కోరారు.

# తీరానికి తల'పోటు'



ఉప్పలగుప్తం, జూన్ 18: : కోనసీమ డ్రెయిన్లలో ఉప్పునీరు పోటెత్తడం పెనుముప్పుగా మా రింది. సాధారణంగా ఏడాదికి ఒకసారి మే నెలలో కర్తరి పోటుకు సముద్ర జలాలు పోటెత్తి పొలాల్లోకి ప్రవహించడం సాధారణమే. అయితే ఈ ఏడాదంతా ఉప్పునీరు పొలాల్లోకి ఎగదన్నడం రైతులకు శాపంగా మారింది. ఉభయగోదావరి జిల్లాల్లోని మలికిపురం, అల్లవరం, ఉప్పలగుప్తం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు తోపాటు పశ్చిమగోదావరి జిల్లాలోని పలు మండలాల్లో చాలాకాలంగా రైతులు ఉప్పునీటి పోటు సమస్యను ఎదుర్కొంటున్నారు. సమస్య పరిష్కారానికి ఎప్పటికప్పుడు తాత్కాలిక చర్యలు తీసుకుంటూనే ఉన్నారు. అయితే ఫలితం శూన్యం. ఏటా సార్వా సాగు చేయడం, ఉప్పునీటికి బలవ్వడం అన్నదాతకు ఆనవాయితీగా మారింది. అలాగే కొబ్బరి చెట్లు చనిపోవడంతో భారీగా నష్టం వాటిల్లుతోంది. ఈ ఏడాది సముద్ర జలాల పోటుపై రైతుల్లో మరింత ఆందోళన పెరిగింది. దీంతో కోనసీమ వ్యాప్తంగా నీటి వినియోగదారులు సంఘాలు ఉన్నతాధికారులను కలిసి పోటు సమస్యకు పరిష్కారం చూపించాలని కోరుతున్నారు. కోనసీమలో పోటు సమస్య పరిష్కారానికి జిల్లా కలెక్టర్ ఇప్పటికే చర్యలు తీసుకున్నారు. కోనసీమలోని ప్రధాన మేజర్ డ్రెయిన్లలో ఒకటైన కూనవరం డ్రెయిన్‌లో ప్రస్తుతం ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. అంతకుముందు రంగరాజుకోడుతో సహా పలు డ్రెయిన్లలో మేటలు తొలగించారు. అయినా పరిస్థితిలో మార్పు లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపడుతున్నా ప్రయోజనం లేకపోవడం గమనార్హం. సార్వా సాగుకు ఇప్పటికే జాప్యం జరిగింది. ఇప్పుడు నారుమళ్లు పోయాలంటే పొలాల్లో ఉప్పునీరు తిష్టవేసింది. అది బయటకు పోయేదెప్పుడు? నారు పోసేదెప్పుడు? నాట్లు పడేదెప్పుడు? వీటికి జవాబు దొరక్క రైతులు సందిగ్ధంలో పడ్డారు.

# ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవరు మృతి

## ట్రాక్టర్‌లో ఇరుక్కుపోయిన మహేష్ మృతదేహం



పీసీపల్లిజూన్ 18: : ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడి ఒకరు మృతి చెందారు. ఈఘటన మధ్యాహ్నం మండలంలోని భట్టుపల్లి సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పెద్దన్నపల్లి గ్రామానికి చెందిన అరటివేముల మహేషకు భార్య స్రవంతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయంతో పాటు తాపీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల పీసీపల్లిలో కొత్త ఇల్లు నిర్మించేందుకు ఒప్పందం చేసుకున్నాడు. ఇందుకు సంబంధించిన ఇనుపచువ్వను తెచ్చేందుకు తన సొంత ట్రాక్టర్‌తో కనిగిరి వెళ్లాడు. అక్కడ ఐరన్‌ను లోడు చేయించుకున్న మహేష్ భట్టుపల్లి మీదుగా పీసీపల్లికి వస్తున్నాడు. మధ్యాహ్నం సమయంలో ఐరన్‌లోడుతో వస్తున్న ట్రాక్టర్ భట్టుపల్లి దాటగానే అదుపుతప్పి బోల్తా పడింది. ట్రాక్టర్‌ను నడుపుతున్న మహేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న పీసీపల్లి ఎస్సై ఎక్స్‌కవేటర్ ద్వారా ట్రాక్టర్‌ను ఇంజన్‌ను వేరుచేసి ఇరుక్కుపోయి ఉన్న మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టమ్ కోసం కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తాపీ పనిచేస్తూ మండలంలోని చుట్టుపక్కల గ్రామాలకు సుపరిచితుడైన మహేష్ ట్రాక్టర్ ప్రమాదంలో మృతిచెందాడన్న విషయం తెలియడంతో పీసీపల్లి, తలకొండ పాడు, ముద్దపాడు, పెద్దన్నపల్లి, మర్రికుంటపల్లి, భట్టుపల్లి, బుడ్డా రెడ్డిపల్లి తదితర గ్రామాల ప్రజలంతా ప్రమాదస్థలానికి చేరుకున్నారు. మహేష్ సొంతగ్రామమైన పెద్దన్నపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# సర్వేలకే పరిమితమైన నూతన లైన్లు

## గిద్దలూరు రైల్వే స్టేషన్
## నిర్మాణానికి నిధులు ఇవ్వని రైల్వే శాఖ

గిద్దలూరు,జూన్ 18: : రైల్వే ప్రయాణికుల నుంచి ఆదాయాన్ని దండుకుంటున్న రైల్వేశాఖ వారికి మాత్రం మెరుగైన సౌకర్యాలను మాత్రం కల్పించడం లేదు. గిద్దలూరు నుంచి భాకరాపేటకు, కంభం నుంచి పొద్దుటూరుకు కొత్త రైల్వేలైన్ల నిర్మాణానికి సంబంధించి రైల్వే శాఖ సర్వే పనులను చేపట్టింది. సర్వే పూర్తయి ఏళ్లు గడుస్తున్నా బడ్జెట్‌లో మాత్రం ఈ రెండు రైల్వే లైన్ల నిర్మాణానికి మాత్రం నిధులు మంజూరు చేయడం లేదు. ప్రతి బడ్జెట్‌లో ఈ రెండు రైల్వేలైన్ల నిర్మాణ సర్వేకు అంతో ఇంతో కేటాయిస్తున్నారే తప్ప నిర్మాణ పనులు మాత్రం మొదలు పెట్టడం లేదు. గిద్దలూరు నుంచి భాకరాపేటకు కొత్త రైల్వే లైన్ ని ర్మాణం చేపడితే గిద్దలూరు మండలంలోని ముండ్లపాడు, సంజీవరాయునిపేట, ఉయ్యాలవాడ, కడప జిల్లాలోని కలసపాడు, పోరుమామిళ్ళ, బద్వేలుకు రైల్వే సౌకర్యం ఏర్పడుతుంది. దానికితోడు తిరుపతి వెళ్లేందుకు దగ్గరి దారిగా కూడా ఉంటుంది. సు మారు 150 కిలోమీటర్ల మేర ఉండే గిద్దలూరు–భాకరాపేట నిర్మాణం పూర్తయితే కడప, ప్రకాశం జిల్లాల ప్రయాణికులకు ఎంతో వెసలుబాటు కలుగుతుంది. ఈ ప్రాంతంలోని ఏ ఒక్క గ్రామానికి, పట్టణానికి ప్రస్తుతం రైల్వే సౌకర్యం లేదు కావున సౌకర్యం వచ్చినట్లు అవుతుంది. సర్వే పూర్తి అయి ఐదారేళ్లు అయినా ఇంకా సమగ్ర సర్వే అంటూ మీనవేషాలు లెక్కిస్తున్నది. అలాగే కంభం నుంచి పొద్దుటూరుకు కూడా కొత్త రైల్వేలైన్ నిర్మాణానికి ఇప్పటికే సర్వే దాదాపు పూర్తయింది. నిధుల సమస్య గురించి రైల్వే శాఖ ప్రస్తావించిన సందర్భంలో గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం ఖర్చును భరించేందుకు కూడా ప్రతిపాదనలు జరిగాయి. కంభం–పొద్దుటూరు మధ్య 142 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ నిర్మించాల్సి ఉండగా, బేస్తవారపేట, కొమరోలు మండలాల్లోని, అలాగే కడప జిల్లా పోరుమామిళ్ల ప్రాంతవాసులకు కొత్తగా రైలు సౌకర్యం లభిస్తుంది. ఈ రెండు పట్టణాల



మధ్య సుమారు 15 రైల్వే స్టేషన్లు కూడా ప్రయాణికులకు అందుబాటులోకి వస్తాయి. కానీ రైల్వేశాఖ మాత్రం దక్షిణాదిపై చిన్నచూపు చూస్తుండగా ముఖ్యంగా పశ్చిమ ప్రకాశంపై ఇంకా చిన్నచూపు చూస్తున్నది. ఈ రెండు కొత్త రైల్వేలైన్ల నిర్మాణం జరిగితే గిద్దలూరు, కంభం రైల్వేస్టేషన్లు జంక్షన్లుగా మారి మరింత అభివృద్ధి చెందుతాయి. ఈ ప్రాంతవాసులకు కడప, చిత్తూరు జిల్లాలకు వెళ్లాలంటే 30 నుంచి 50 కిలోమీటర్ల దూరం తగ్గడమే కాకుండా సౌలభ్యంగా కూడా ఉంటుంది. ఎమ్మెల్యేలు, ఎంపీలు ఈ రెండు కొత్త రైల్వేలైన్ల నిర్మాణానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి నిధులు మంజూరు చేపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# వేరుశనగ కాయలను సద్వినియోగం చేసుకోవాలి

## రైతులకు సబ్సిడీ విత్తనకాయలను అందజేస్తున్న ఏవో రాజకుమారి



లక్కిరెడ్డిపల్లె, జూన్ 18: : ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వేరుశనగ కాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో రాజకుమారి, టీడీపీ యు వజన మండల నా యకుడు యనమల మదనమోహన పేర్కొన్నారు. దిన్నెపాడు, కస్తూరిరాజుగారిపల్లె గ్రామాల్లో సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ కోసం రైతుకు 50 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తన కాయలను ప్రభుత్వం సరఫరా చేస్తోందని, దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో లక్కిరెడ్డిపల్లె మండలానికి 20 క్వింటాళ్ల వేరుశనగ కాయలు మంజూరు చేయించారన్నారు. కం దులు, ఉలవలు, అలసందలు, ఆముదాలు సకాలంలో అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్థక శాఖ ఏడీహెచ బెనర్జీ, పశు వైద్యాధికారి మహేశ, డాక్టర్ ఎస్‌యండీ షఫీనాయక్, జయరాములు, ధర్మరా జు, పీరయ్య, ఓబులేసు, రాజు, నాగేంద్రరాజు, జనార్ధనరెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# 'మంచినీరివ్వండి'
# : మహిళల ధర్నా



విశాఖ ,జూన్ 18: : 'మంచినీరివ్వండి' అంటూ విశాఖ జిల్లా బుక్కా వీధిలో స్థానిక మహిళలతో కలిసి సిఐటియు నేతలు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిఐటియు నాయకులు ఎం.సుబ్బారావు మాట్లాడుతూ విశాఖపట్టణాన్ని మరో సింగపూర్, ముంబై చేస్తామని చంద్రబాబు చెబుతున్నారని, ప్రజలకు మంచినీటిని సరఫరా చేయలేనివారు ఈ నగరాన్ని ఉద్ధరిస్తామని చెప్పడం చాలా మోసం అని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. చాలా నెలల నుండి మంచినీటి సమస్యపై మహిళలు నిరసన తెలియజేస్తున్నప్పటికీ జీవీఎంసీ అధికారులకు కనీసం చలనం లేకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. 38వ వార్డులో రోడ్లన్నీ తవ్వేసి నెలలో సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ వాటిని బాగు చేయకుండా నిర్లక్ష్యంగా పాలకులు జీవిఎంసి అధికారులు ఉన్నారని ఆరోపించారు. మంచినీటిలో మురుగునీరు కలిసి పోతుందని అనేక సార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలియజేశామనీ కనీసం స్పందించలేదు అని చెప్పారు. కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ కి మెమోరండం తెలియజేశామనీ అయినా సరే సమస్య పరిష్కారం చేయలేదు అని తెలిపారు. కొళాయి నీటిని తాగుతూ డయేరియా వచ్చి అనేక మంది ఆసుపత్రి పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న పిల్లలు, గర్భిణి స్త్రీలు, ముసలివారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 3 మాసాలు కిందట కలెక్టర్ ను కలిసి మంచినీటి సమస్య గురించి ఈరోజు బుక్కా వీధిలో మంచినీటి సమస్య పరిష్కారం చేయాలని స్థానిక మహిళలతో ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది ఈ ధర్నాను ఉద్దేశించి సిఐటియు నాయకులు ఎం సుబ్బారావు గారు విశాఖపట్నాన్ని మరో సింగపూర్, ముంబై చేస్తామని చంద్రబాబు నాయుడు చెపుతున్నారు. మంచినీరు సప్లై చేయనంటివారు ఈ నగరాన్ని ఉద్ధరిస్తామని చెప్పడం చాలా మోసం. అనేక నెలల నుండి మంచినీటి సమస్యపై మహిళలు నిరసన తెలియజేస్తున్న జీవీఎంసీ అధికారులకు కనీసం చలనం లేకపోవడం సిగ్గుచేటు. 38వ వార్డులో రోడ్లన్నీ తవ్వేసి నెలలో సంవత్సరాలు గడుస్తున్న బాగు చేయకుండా నిర్లక్ష్యంగా పాలకులు జీవంసి అధికారులు ఉన్నారు. మంచినీటిలో మురుగునీరు కలిసి పోతుందని అనేక సార్లు అధికారులకు,ప్రజాప్రతినిధులకు తెలియజేశారు. కనీసం స్పందించలేదు. కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ గారికి మెమోరండం తెలియజేశాం అయినా సరే సమస్య పరిష్కారం చేయలేదు.

# యోగా దినోత్సవం విజయవంతం చేయాలి

## మాట్లాడుతున్న ఎస్ఎన్ వర్మ, సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, భాష్యం ప్రవీణ్ తదితరులు:



విజయనగరం,జూన్ 18: : యోగా దినోత్సవం విజయవం తంచేయాలని పిఠాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఎస్ఎన్ వర్మ కోరారు. విజయనగరంలో ఎమ్మెల్యేలు అదితిగజపతిరాజు,భాష్యం ప్రవీణ్‌తో కలిసి నియోజకవర్గనాయకులతో యోగాదినోత్సవఏర్పాట్లపై సమీక్షించారు. నియోజకవర్గ పరిధిలోని గ్రామాలు, డివిజన్ల నుంచి నాయకులు, కార్యకర్తలు కార్యక్ర మంలో పాల్గొనాలన్నారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసా దుల ప్రసాద్, బొద్దల నర్సింగరావు, ఆల్తిబంగారుబాబు, నర్సింగరావు, కంది మురళీ నాయుడు, అవనాపు విజయ్, సూర్యకుమారి, అనురాధ బేగం పాల్గొన్నారు.

# మామిడి కాయల టోకెన్ల కోసం తోపులాట

టోకెన్ల కోసం ఎదురుచూస్తున్న మామిడి రైతులు



గుడిపాల జూన్ 18: : గుడిపాల మండలంలోని ఫుడ్ అండ్ ఇన్స్ ఫ్యాక్టరీ వద్ద టోకెన్ల కోసం మామిడి రైతులు తోపులాడుకున్నారు. రోజుకు 50నుంచి 80దాకా మాత్రమే టోకెన్లు ఇస్తుండగా వాటికోసం వస్తున్న మామిడి రైతుల సంఖ్య రోజురోజుకూ పెరగడంతో ఫ్యాక్టరీ యజమానులు రైతులకు ఎటూ చెప్పలేక గమ్మునుండి పోయారు. ఫ్యాక్టరీలో పల్ప్ తయారీలో సాంకేతిక లోపం వలన సకాలంలో మామిడి కాయలు అన్‌లోడ్ చేయక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మరోపక్క టోకెన్ల కోసం వందలాదిమంది ఫ్యాక్టరీ వద్ద గుమికూడారు. టోకెన్లను జారీ చేయాలని ఫ్యాక్టరీ సిబ్బందిని పట్టుబట్టారు. ఫ్యాక్టరీ మేనేజర్ చంద్రశేఖర్, సూపర్‌వైజర్ రమేష సిబ్బందితో కలసి టోకెన్లు జారీ చేస్తుండగా రైతుల మధ్య తోపులాట జరిగింది. దీంతో డీఎస్పీ సాయినాథ్, ఎస్ఐ రామ్మోహన్ ఫ్యాక్టరీ వద్దకు చేరుకుని రైతులతో చర్చించి జూలై 5వ తేది వరకు సుమారు 1200 టోకెన్లను పంపిణీ చేయించారు. దీంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. ఇదిలా ఉండగా సీకేపల్లె వద్ద ఉన్న తాజా మ్యాంగో ఫ్యాక్టరీలో కాయల అన్‌లోడింగుకు ఎమ్మెల్యే పేరును వైసీపీ వారు వాడుకుంటున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి హేమాద్రినాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆరోపించారు. ఎమ్మెల్యే జగన్ రైతుల మనిషి అని, ఆయన ఎవరికీ సిఫార్సు చేసే వ్యక్తి కాదంటూ ఫ్యాక్టరీ యజమానులతో వాగ్వాదానికి దిగి నిజమైన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# చివరి కోత వరకు మామిడికి సబ్సిడీ అందిస్తాం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, పక్కన జేసీ శుభం బన్సల్



తిరుపతి జూన్ 18: : 'చివరి పంట వరకు మామిడికి సబ్సిడీ అందిస్తాం. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందవద్దు. కాయలు పక్వానికి వచ్చాకే కోసి గుజ్జు తయారీ పరిశ్రమకు తీసుకురండి' అని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులు నష్టపోకుండా తోతాపురికి మద్దతు ధర రూ.12గా నిర్ణయించడం జరిగిందని, అందులో ప్రాసెసింగ్ యూనిట్ వారు రూ.8, మరో రూ.4 ప్రభుత్వం సబ్సిడీగా చెల్లిస్తుందన్నారు. చివరి కోత వరకు కూడా రూ.4 సబ్సిడీని ప్రభుత్వం ఇస్తుందని స్పష్టంచేశారు. మామిడి రైతుల కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను 0877-2236007 నెలంబరులో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. మామిడి గుజ్జు పరిశ్రమల వారు సిండికేట్ అయి రైతులకు అన్యాయం చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మామిడి సీజన్ ముగిసే వరకు రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మామిడి గుజ్జు పరిశ్రమలు, మండీలు, ర్యాంపుల వద్ద అధికారులను నియమించామని, వారు రైతులకు సహకరిస్తారన్నారు. కాగా, ఈ ఏడాది తోతాపురి దిగుబడి పెరగడం, రష్యా, ఉక్రెయిన్ యుద్ధంతో మామిడి పల్ప్ ఎగుమతి తగ్గడంతో సమస్య తలెత్తిందన్నారు. తమిళనాడు, కర్ణాటకలో మామిడి గుజ్జు పరిశ్రమల నుంచి పార్లే, కోకకోలా, పెప్సీ కంపెనీ వాళ్లు కొన్నారని, దీంతో రెండేళ్లుగా మన జిల్లాలో పరిశ్రమల్లో మామిడి గుజ్జు నిల్వలు ఉండిపోయినట్లు చెప్పారు. గడిచిన వారం నుంచి జిల్లాలో రోజుకు 2వేల టన్నుల చొప్పున తోతాపురి కొనుగోలు జరుగుతోందని, ఇప్పటి వరకు 16వేల టన్నులు ప్రాసెస్ చేశారని వివరించారు. రూ.4 సబ్సిడీ వల్ల ఉమ్మడి జిల్లాలోని రైతులకు రూ.170 కోట్ల లబ్ధి కలగనుందన్నారు. ఈ పంట నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సబ్సిడీ అందుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాశాఖాధికారి ప్రసాదరావు, ఉద్యానవన శాఖ అధికారి దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు సహకారం



నందికొట్కూరు, జూన్ 18: : గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేసుకున్న రైతు ఉత్పత్తి దారుల సంఘాలకు నాబార్డు నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని నంద్యాల జిల్లా నాబార్డు ఏజీఎం కార్తీక్ తెలిపారు. మండలంలోని అల్లూరు గ్రామంలో రైతులు ఏర్పాటు చేసిన అవని రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని(ఎఫపీఓ) పరిశీలించారు. రైతులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు. అనంతరం ఆయన రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏజీఎం మాట్లాడుతూ రైతులు సంఘటితంగా ఇన్‌పుట్ అలాగే అవుట్‌పుట్ వ్యాపారాలు హోల్ సేల్‌గా నిర్వహించుకోవాలని సూచించారు. అగ్రికల్చర్, హార్టికల్చర్, అనిమల్ హస్బెండరీ అన్ని ప్రభుత్వ డిపార్టుమెంట్ స్కీములను అందుబాటులోకి వచ్చేలా సంఘం బోర్డ్ ఆఫ్ డైరెక్టర్, సీఈవోలు కృషి చేయాలని సూచించారు. ఎఫ్‌పీవో అభివృద్ధి కోసం నాబార్డు అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని రైతులకు తెలిపారు. ఇదే సందర్భంలో పీఏసీఎస్ సెక్రటరీ అశోక్ మాటాడుతూ త్వరలో రైతులకు ఎరువులు, పురుగు మందులు అందుబాటు లోకి తెస్తున్నామన్నారు. కార్యక్రంలో ఎఫ్‌పీవో డైరెక్టర్ బి. జయమ్మ, లక్ష్మీనారాయణరెడ్డి, నారాయణ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# మారనున్న గిరిజనుల బతుకులు



సాలూరు: జూన్ 18: కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా గిరిజనుల బతుకుల్లో స్వర్ణయుగం రానున్నట్టు రాష్ట్ర గిరిజన, స్త్రీశిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని కొత్తవలస గిరిజన ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన ధర్తి ఆబజన్-జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. భారత ప్రభుత్వం గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా 2024 అక్టోబరు 2న ప్రారంభించిన ఈ పథకం దేశంలోని గిరిజన గ్రామాల సమగ్ర అభివృద్ధికిగానూ రూపొందించారని అన్నారు. ఈ పథకం 2024-25 నుంచి 2028-29 వరకు 5 సంవత్సరాలపాటు అమల్లో ఉంటుందని చెప్పారు. ఈ పథకం కింద దేశంలో గిరిజనులు నివసించే 63వేల 843 గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, విద్య, వైద్య సేవలు, జీవనోపాధి, రోడ్ల అనుసంధానం, ఆర్థిక సాధికారిత వంటి కీలకరంగాల్లో అభివృద్ధి చర్యలు చేపడతాయని ఆమె వివరించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 165 గిరిజన గ్రామాలను ఎంపిక చేశారని ఆమె తెలిపారు. వీటికి సంబంధించి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక లు రూపొందించారని చెప్పారు. దీనిపై జూన్ 15 నుంచి 30 వరకు అవగాహన, ప్రయోజన సదస్సులు నిర్వహిస్తా రని ఆమె తెలిపారు. ప్రతి గిరిజన గ్రామంలో గిరిజన స్థితిగతులపై సర్వే నిర్వహించి గిరిజనులకు 14 ప్రభుత్వ ప్రధాన సేవలు అందిస్తామని ఆమె చెప్పారు. రాష్ట్రంలో డోలీ మోతలు లేకుండా రూ.1300 కోట్లతో రహదారుల నిర్మాణం చేపట్టారని ఆమె తెలిపారు. అందులో భాగంగా సాలూరు నియో జకవర్గంలో రూ.110 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా నేరుగా తల్లుల ఖాతాల్లోకి రూ.13వేలు జమ చేశామన్నారు.

# జోరుగా అనాస, పనస విక్రయాలు

చిట్రాళ్లగొప్పు దుకాణంలో విక్రయానికి ఉంచిన అనాస, పనస పండ్లు

చిట్రాళ్లగొప్పు మార్కెట్‌లో ఊపందుకున్న అమ్మకాలు

ధరలు పెరగడంతో రైతులు హర్షం



చింతపల్లి, జూన్ 18: : ఆంధ్ర కశ్మీర్ లంబసింగికి సమీపంలో ఉన్న చిట్రాళ్లగొప్పు ఉద్యాన పంటల మార్కెట్‌లో అనాస, పనస పండ్ల విక్రయాలు ఊపందుతున్నాయి. ఈ ఏడాది గిరిజన ప్రాంతం నుంచి అనాస, పనస ఎగుమతులు పెరిగాయి. దీంతో పండ్లకు గిరాకీ పెరిగింది. పనస కాయ పరిమాణం ఆధారంగా రైతులకు రూ.80 నుంచి రూ.150, అనాస రూ.20 నుంచి రూ.25 ధర లభిస్తోంది. గత ఐదేళ్ల తరువాత మార్కెట్ ప్రారంభంలోనే అనాస, పనస పండ్లకు మంచి ధర రావడంతో గిరిజన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చింతపల్లి, జీకేవీధి మండలాల్లో ఆదివాసీ రైతులు సంప్రదాయ పంటగా అనాస, పనస సాగు చేస్తున్నారు. ప్రతి ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు అనాస, పనస దిగుబడులు వస్తాయి. రెండు మండలాలకు చెందిన గిరిజన రైతులు అనాస, పనస పండ్లను చిట్రాళ్లగొప్పు మార్కెట్‌కి తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. మార్కెట్‌కి వచ్చిన అనాస, పనస పండ్లను వర్తకులు కొనుగోలు చేసి భద్రాచలం, హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. మార్కెట్‌లో వారం రోజులపాటు పండ్లు విక్రయిస్తుంటారు. సోమవారం, గురువారం, శుక్రవారం గిరిజనులు అధిక మొత్తంలో మార్కెట్‌కి తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. రైతుల వద్ద వర్తకులు గంపగుత్తగా పండ్లను కొనుగోలు చేస్తారు. అయినప్పటికి రైతులు ఆశించిన గరిష్ఠ ధర లభిస్తున్నది.

**దుకాణాల్లో విక్రయం**

చిట్రాళ్లగొప్పు మార్కెట్‌లో వర్తకులు దుకాణాల వద్ద ప్రతి రోజు అనాస, పనస విక్రయాలు సాగిస్తున్నారు. ఈ దుకాణాల్లో రైతులు విక్రయించిన ధర కంటే రూ.30 నుంచి రూ.50 ధర అధికంగా ఉంటుంది. చిట్రాళ్లగొప్పు మార్కెట్ మీదుగా ప్రయాణించే పర్యాటకులు, ప్రయాణికులు దుకాణాల్లో విక్రయించే పండ్లను కొనుగోలు చేస్తున్నారు. ఈ దుకాణాల్లో రూ.100కు మూడు అనాస, రూ.100 నుంచి 200 వరకు పనస పండ్లు విక్రయిస్తున్నారు. రైతుల నుంచి నేరుగా పనస, అనాస పండ్లు కొనుగోలు చేయాలంటే సోమ, గురు, శుక్రవారాల్లో అందుబాటులో వుంటాయి.

# విద్యార్థులకు తప్పిన పెనుప్రమాదం

ఘటనా స్థలంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి



డెంకాడ, జూన్ 18: : డెంకాడలో ఓ ఆర్టీసీ, స్కూల్ బస్సు ఢీకొన్న ఘటనలో పెనుప్రమాదం తప్పింది. దీంతో స్థాని కులు, తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ఎస్ఐ సన్యాసినాయుడు కథ నం మేరకు.. డెంకాడలో ఓ ఇంగ్లీషు మీడియం స్కూల్ బస్సు నాతవలస వైపు నుంచి విజయనగరం వెళ్తోంది. అదే సమయంలో విజయనగరం నుంచి శ్రీకాకుళం వెళ్తున్న ఆర్టీసీబస్సు ఆ బస్సును ఢీకొంది. ఆ సమయంలో ఆర్టీసీబస్సులో 30 మంది ప్రయాణికులు, స్కూల్ బస్సులో 34 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే విద్యార్థులు, ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. స్వల్ప గాయాలైన విద్యార్థులను 108లో ప్ర?థమ చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. డెంకాడ ఎస్ఐ సన్యాసినాయుడు ప్రమాద స్థలానికి చేరుకొని సహాయ చర్యలు చేపట్టారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అదే సమయంలో విజయనగరం వెళ్తున్న స్థానిక ఎమ్మెల్యే లోకంనాగమాధవి సహాయ చర్యల్లో పాల్గొని విద్యార్థుల పరిస్థితిని అడిగితెలుసుకున్నారు.

# యోగాకు స్థల పరిశీలన



నంబులపూలకుంట, జూన్ 18: : దేశవ్యాప్తంగా ఈ నెల 21న నిర్వహించే యోగాదినోత్సవం సందర్భంగా యోగా చేయ డానికి మండలాధికారులు స్థలాన్ని పరిశీలించారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మండలంలో తిమ్మమ్మ మర్రిమాను వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందని నాయకులు, అధికారులు అక్కడ స్థలాన్ని పరిశీలించారు. ఏర్పాట్లు చేయడానికి సన్నద్ధమవుతున్నారు. అనంతరం గూటిబైలు జిల్లాపరిషత ఉన్నతపాఠశాలను తనిఖీ చేశారు. ఎంపీడీఓ పార్థసారథి ఎంఈఓ గోపాల్‌నాయక్, డిప్యూటీ ఎంపీడీఓ మాధవరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ చంద్ర శేఖర్‌నాయుడు, సర్పంచలు విష్ణుమూర్తి, శ్రీనివాసు లు, జూనియర్ అసిస్టెంట్ సురేష్‌బీ పంచాయతీ కార్యదర్శి హరి బాబు, ప్రేమశేఖర్, టూరిజం గైడ్ మనోహర్, సిఆర్పీ నగేష్‌నాయక్ పాల్గొన్నారు.

# రాయిపాడులో వైరల్ జ్వరాలు

ప్రతి ఇంటిలో ఒకరిద్దరు బాధితులు

గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని గిరిజనుల వినతి

రావికమతం,జూన్ 18: : మండలంలోని చీమలపాడు పంచాయతీ శివారు రాయిపాడు గిరిజన గ్రామంలో వైరల్ జ్వరాలు విజృంభించాయి. వాతావరణంలో మార్పులు, వర్షాలు కురుస్తుండడంతోపాటు తాగునీటి వనరులు కలుషితం కావడంతో ప్రతి ఇంటిలో ఒకరిద్దరు జ్వరాలబారిన పడ్డారు. గ్రామంలో మొత్తం 80 మంది జనభా వుండగా గెమ్మిలి అనిత, చిక్కిలి అంజలి, గెమ్మిలి గంగ, గెమ్మిలి చిలకమ్మ, సీదిరి ఎరికినాయుడు, పాంగి రామారావు, తదితరులు తీవ్రజ్వరంతో బాధపడుతున్నారు. ఏఎన్ఎం వచ్చి మందులు ఇచ్చినప్పటికీ జ్వరాలు తగ్గలేదు. ఓపికతోపాటు స్థోమత ఉన్న వారు కొత్తకోటలో ప్రైవేటు వైద్యుల వద్దకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. మిగిలిన వార ఆర్ఎంపీ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. అయినప్పటికీ జ్వరాలు తగ్గడంలేదని బాధితులు వాపోతున్నారు. జ్వరంతోపాటు కాళ్లు, చేతులు పట్టేస్తున్నాయని, మంచంలో నుంచి లేచే ఓపిక కూడా ఉ ండడంలేదని చెబుతున్నారు. తక్షణమే గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. కాగా కొండ శిఖరంపై ఉన్న చలిసింగం గ్రామంలో కూడా సుమారు 30 మంది జ్వరాలతో బాధపడుతున్నట్టు తెలిసింది. వీరిలో కొంతమంది నర్సీపట్నంలో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లినట్టు గ్రామస్థులు తెలిపారు

# బాబోయ్ బీఎన్ రోడ్డు!

♦ అడుగడుగునా గోతులతో జనం బెంబేలు

♦ ప్రమాదకరంగా తయారైన ప్రయాణం

♦ పాడైపోతున్న వాహనాలు

♦ గత ప్రభుత్వ పాలకుల నిర్వాకంతో జనం పాట్లు

♦ ఏడాది దాటినా స్పందించని కూటమి ప్రభుత్వం



చోడవరం,జూన్ 18 : జిల్లాలో ప్రధాన రహదారుల్లో ఒకటైన భీమునిపట్నం-నర్సీపట్నం రోడ్డు చోడవరం నియోజకవర్గం పరిధిలో అత్యంత దారుణంగా తయారైంది. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన పలు నియోజకవర్గాల ప్రజలు రాకపోకలు సాగించే ఈ రోడ్డు నిర్వహణ, అభివృద్ధి విషయంలో గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల పరిధిలో పలుచోట్ల రహదారి మొత్తం ఛిద్రమై, భారీ గోతులు ఏర్పడిన విషయం తెలిసిందే. నాలుగేళ్ల క్రితం ఎన్‌డీబీ నిధులతో అభివృద్ధి, విస్తరణ పనుల కోసం అప్పటి ప్రభుత్వం టెండర్లు పిలిచింది. అందరికన్నా తక్కువ రేటుకు కోట్ చేసిన కాంట్రాక్టర్ రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల పరిధిలో రోడ్డుకు ఇరువైపులా విస్తరణ పనులు, కొన్నిచోట్ల కల్వర్టుల నిర్మాణ పనులు చేపట్టారు. సుమారు రూ.10 కోట్ల విలువ చేసే పనులు పూర్తయిన తరువాత బిల్లులు అప్‌లోడ్ చేశారు. కానీ అప్పటి ప్రభుత్వం మొబిలైజేషన్ నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. అయినప్పటికీ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. గత ఏడాది ఎన్నికల వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. మరోవైపు నిర్వహణ పనులు (రోడ్డుపై ఏర్పడిన గోతులు పూడ్చడం, ఇరువైపులా తవ్వలు నరకడం) చేపట్టకపోవడంతో రహదారిపై ఏటేటా గోతులు మరింత అధికం అయ్యాయి. వర్షం కురిసినప్పుడు నీరు నిలిచిపోయి, వాహనాల రాకపోకలతో మరింత పెద్దవిగా తయారవుతున్నాయి. పలుచోట్ల రోడ్డు మొత్తం ధ్వంసమై, వర్షం నీటితో పంట కుంటలను తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణ సమయం రెట్టింపు అవుతుండడంతోపాటు వాహనాలు పాడైపోతున్నాయని వాపోతున్నారు. జిల్లాలో ఇతర రహదారులను అభివృద్ధి చేస్తున్న కూటమి ప్రభుత్వం.. బీఎన్ రోడ్డు గురించి ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదని నియోజకవర్గం ప్రజలు ఆవేదనతో ప్రశ్నిస్తున్నారు. రోడ్డు అభివృద్ధి అటుంచి.. కనీసం గుంతలు అయినా పటిష్ఠంగా పూడ్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# గిరి మహిళల కన్నీటి కష్టాలు

రెండు మైళ్ల దూరం నుంచి నీళ్లు మోసుకొస్తున్న సిరగంపుట్టు మహిళలు

తాజంగి సిరగంపుట్టు వీధిలో సమస్యల

మైళ్ల దూరం నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న వైనం

చింతపల్లి, జూన్ 18 : మండలంలోని తాజంగి గ్రామ పంచాయతీ సిరగంపుట్టు వీధి మహిళలకు నీటి కష్టాలు తప్పడం లేదు. గ్రామంలో మూడేళ్ల క్రితం మంజూరైన జల్‌జీవన్ రక్షిత మంచినీటి పథకం ఇప్పటి వరకు పూర్తికాలేదు. పనులు అర్ధాంతంగా నిలిచిపోయాయి. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో స్థానిక గిరిజన మహిళలు రెండు మైళ్ల దూరంలో ఉన్న ఊటగెడ్డ నుంచి నీళ్లను తెచ్చుకుంటున్నారు. ఊటగెడ్డ దూరంగా ఉ ండడంతో రెండు, మూడుసార్లు నీళ్ల కోసం



వెళ్లడం భారంగా వుందని, ఒకేసారి మహిళలు శిరస్సుపై నాలుగు, ఐదు బిందెలను మోసుకొని వస్తున్నారు. అధిక బరువు శిరస్సుపై మోసుకురావడం వల్ల భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

# విధుల్లోకి ఐఎన్ఎస్ అర్నాల

విశాఖ నేవల్ డాక్‌యార్డ్‌లో జలప్రవేశం

విశాఖపట్నం,జూన్ 18 : భారత నౌకాదళం అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరనుంది. సముద్ర గస్తీ, అన్వేషణ, సహాయ కార్యక్రమాలకు ఉపయోగించేలా రూపొందించిన తొలి యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్ (ఏఎస్‌డబ్ల్యు-ఏఎస్‌డబ్ల్యు) ఐఎన్ఎస్ 'అర్నాల' బుధవారం జలప్రవేశం చేయనుంది. విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డ్‌లో జరిగే ఈ కార్యక్రమానికి డిఫెన్స్ స్టాఫ్ చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్ అధ్యక్షత



వహిస్తుండగా, తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్ ఆతిథ్యం ఇస్తున్నారు. ఈ నౌకను కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ డిజైన్ చేసి తయారు చేసింది. పీపీపీలో భాగంగా ఎల్ అండ్ టీ షిప్ బిల్డర్స్ దీనికి సహకారం అందించింది. ఈ తరహా నౌకలు మొత్తం 16 తయారు చేయాలని నేవీ నిర్ణయించింది. అందులో అర్నాల మొదటిది. మహారాష్ట్రలోని చారిత్రాత్మక అర్నాల కోటకు గుర్తుగా దీనికి ఈ పేరు పెట్టారు. గత నెల 8న దీన్ని నేవీ చేతికి అందించగా.. విశాఖలో బుధవారం జలప్రవేశం చేయిస్తున్నారు. అర్నాల 77.6 మీటర్ల పొడవు, 1,490 టన్నుల బరువు ఉంటుంది.

# పల్నాడులో ముగ్గురు కౌలు రైతుల ఆత్మహత్య

ఒకే రోజు అప్పులకు బలి

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఉన్నతాధికారులు



నాదెండ్ల/ఈపూరుజూన్ 18 : వ్యవసాయంలో నష్టాలతో అప్పుల పాలైన ముగ్గురు రైతులు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన పల్నాడు జిల్లాలో జరిగింది. నాదెండ్ల మండలం నాదెండ్ల గ్రామంలోని రామాపురం కాలనీకి చెందిన నాసం ఆదినారాయణ(45) ఏడు సంవత్సరాలుగా తన ఎకరన్నరతో పాటు సుమారు 50కి పైగా ఎకరాలను కౌలుకు తీసుకొని మిర్చి, పత్తి, శనగ తదితర పంటలు సాగు చేస్తున్నాడు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేక పోవటంతో పాటు పైర్లు తెగుళ్ల బారిన పడటం, గిట్టుబాటు ధర లేక పోవటంతో సుమారు రూ 70 లక్షల అప్పులపాలయ్యాడు. రుణదాతలు ఇంటికి వచ్చి ఒత్తిడి చేయటంతో తట్టుకోలేక గ్రామ సమీపంలోని పొలాల్లో రాత్రి పురుగు మందు తాగాడు. ఉదయం ఆదినారాయణ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. అదే విధంగా మండలంలోని తూబాడు గ్రామానికి చెందిన సిరిబోయిన గోపాలరావు(44) తన 30 సెంట్లతో పాటు సుమారు 12 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ ఏడాది మిర్చి పైరుకు తెగుళ్ల సోకటంతో పెట్టుబడులు కూడా దక్కలేదు. పొగాకు పండించినా కొనే వారు లేక పోవటంతో నిల్వ చేసి పట్టాలు కప్పాడు. సుమారు రూ.20 లక్షల మేర అప్పులపాలయ్యాడు. సాయంత్రం తన ట్రాక్టర్‌ను అప్పు ఇచ్చిన వారు తీసుకెళ్లడంతో మనస్తాపానికి గురయ్యాడు. తన ఇంటికి సమీపంలోని దొంక వద్దకు వెళ్లి పురుగు మందు తాగి మృతి చెందాడు. ఎస్ఐ పుల్లారావు మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు పాల్పడిన రైతులు గోపాలరావు, ఆదినారాయణ కుటుంబాలను వ్యవసాయ శాఖ కమిషనర్ ఎస్.ఢిల్లీరావు, పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు సాయంత్రం పరామర్శించారు. రైతుల ఇంటికి వెళ్లి వారి భౌతిక కాయాలకు నివాళులర్పించారు. ఆత్మహత్యకు దారి తీసిన కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం న్యాయం జరుగుతుందని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. కాగా.. ఈపూరు మండలం కొచ్చెర్ల గ్రామానికి చెందిన బండి కొండయ్య (52) ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. మూడు ఎకరాల్లో మిర్చి, ఎకరన్నరలో వరి, అర ఎకరంలో పొగాకు సాగు చేశాడు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో పెట్టుబడి కూడా రాక, అప్పులు రూ.4 లక్షలు తీర్చే మార్గంలేక మనస్తాపం చెంది కౌలుకు తీసుకున్న పొలంలోని వేప చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని చిన్న కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు తెలిపారు.

# సరుగుడు సాగుకు మొగ్గు

ఏటేటా పెరుగుతున్న విస్తీర్ణం

వరి, చెరకు సాగు భారంగా మారడమే కారణం

ప్రత్యామ్నాయ పంటలవైపు రైతుల చూపు

జూన్ 18: వరి, చెరకు పంటల సాగు ఖర్చులు, పెట్టుబడి పెరిగిపోవడంతో కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న అరకొర మద్దతు ధరలు గిట్టుబాటు కావడం లేదంటూ పలువురు రైతులు సరుగుడు తోటల సాగుకు మొగ్గుచూపుతున్నారు. వీరిలో ఎక్కువ మంది గత సీజన్ వరకు చెరకు సాగు చేసిన రైతులే వున్నారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి చెరకు సరఫరా నుంచి పేమెంట్ల వరకు ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని, వచ్చే సీజన్‌లో చెరకు క్రషింగ్ జరుగుతుందో లేదో తెలియని పరిస్థితి నెలకొనడంతో సరుగుడు నాట్లు వేస్తున్నట్టు చెబుతున్నారు. కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సరుగుడు మొక్కలు నాటుతున్నారు. పెద్దగా పెట్టుబడి అవసరం లేకపోవడం, నికరంగా ఆదాయం వచ్చేఅవకాశం వుండడంతో వరి, చెరకు సాగు చేసిన భూముల్లో సరుగుడు వేస్తున్నట్టు చెబుతున్నారు. ఎకరా విస్తీర్ణంలో వరి సాగుకు రూ.30-35 వేలు, చెరకు సాగుకు రూ.50-60 వేలు పెట్టుబడి అవుతున్నది. దీనికితోడు కూలీల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకుంటే కొన్నిసార్లు పెట్టుబడి కూడా రావడంలేదు. కుటుంబ సభ్యుల శ్రమపాటు కూడా దక్కని పరిస్థితి ఏర్పడింది. అదే సరుగుడు (రకాన్నిబట్టి) సాగు చేసుకుంటే ఎకరాకు ఐదేళ్లపాటు గరిష్ఠంగా రూ.40 వేలు పెట్టుబడి అవుతుంది. ఎకరాకు గరిష్ఠంగా 60-70 టన్నుల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం పేపర్ మిల్లులు టన్ను రూ.6-7 వేలకు కొనుగోలు చేస్తున్నాయి. ఐదేళ్లకు ఖర్చులుపోను రూ.4 లక్షల వరకు మిగులుతాయి. ఏటా ఎకరాకు సగటున రూ.80 వేలు ఆదాయం వస్తుంది. నాలుగైదేళ్ల క్రితం వేసిన సరుగుడు తోటల ప్రస్తుతం కోతకు రావడం, ఆయా రైతులు సంతృప్తికరమైన ఆదాయం పొందుతుండడంతో చెరకు, వరి సాగుచేసే రైతులు ఈ పంటలకు స్వస్తిపలికి సరుగుడు సాగుకు ఆసక్తి చూపుతున్నారు. గతంలో మెట్ట, బంజరు భూములు, గరప నేలల్లో మాత్రమే సరుగుడు తోటలు సాగు చేసేవారు. కొన్నేళ్ల నుంచి వరి, చెరకు సాగు చేసే పల్లం , నల్లరేగడి భూముల్లో



కూడా సరుగుడు వేస్తున్నారు. పొలాలను కౌలుకు ఇద్దామంటే ఎవరూ ముందుకు రావడంలేదని, వ్యక్తిగత కారణాల వల్ల చెరకు, వరి వంటి పంటలను తాముసాగు చేసే పరిస్థితి లేదని, ఇటువంటి తరుణంలో భూములను ఖాళీగా వుంచేలేక సరుగుడు నాట్లు వేయిస్తున్నామని పెద్ద కమతాలు వున్నరైతులు చెబుతున్నారు. పలువురు రైతులు సరుగుడు సాగుకు ఆసక్తి చూపుతుండడంతో నారుకు డిమాండ్ పెరిగింది. ట్రేలలో పెంచిన హైబ్రిడ్ నారు మొక్కలు ఒక్కొక్కటి రూ.2కు నర్సరీల నిర్వాహకులు విక్రయిస్తున్నారు. సాధారణ నారు అయితే ఒక్కో మొక్క రూపాయికి అమ్ముతున్నారు. ఎకరాకు 4-5 వేల మొక్కలు వేస్తున్నారు. ఐదేళ్ల తరువాత 50 టన్నులకు తగ్గకుండా దిగుబడి వస్తుందని, అప్పటి ధరనుబట్టి ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు.

టుడే
# ఆరోగ్యమే మహాభాగ్యం

## నైట్ టైంలో ఆకలిగా అనిపిస్తుందా.. ఈ విషయాలు తెలుసుకోండి.



చాలామందికి అర్ధరాత్రి ఆకలి వేస్తుంది. ఇది వివిధ కారణాల వల్ల జరగవచ్చు. ముఖ్యంగా రాత్రి మేలుకువగా ఉండేటప్పుడు లేదా ఒత్తిడిలో ఉన్నప్పుడు ఆకలి ఎక్కువగా అనిపిస్తుంది. అలాంటి సమయంలో చాలా మంది చిప్స్, స్వీట్లు వంటి అనారోగ్యకరమైన వాటిని తింటారు. కానీ ఇవి జీర్ణక్రియను దెబ్బతీస్తాయి. నిద్రకు ఆటంకం కలిగిస్తాయి. అంతేకాక బరువు పెరగడానికి కూడా కారణం అవుతాయి. కాబట్టి, మీకు ఆకలిగా అనిపిస్తే ఈ తేలికపాటి, ఆరోగ్యకరమైన ఆహారాలను తీసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇవి మీ ఆకలిని తీరుస్తాయని, అదే సమయంలో నిద్రకు ఇబ్బంది కలిగించవని చెబుతున్నారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం..

**గోరువెచ్చని పాలు**

రాత్రిపూట ఒక చిన్న గ్లాసు గోరువెచ్చని పాలు తాగడం వల్ల కడుపు నిండుగా అనిపిస్తుంది. పాలలో ట్రిప్టోఫాన్ అనే పదార్థం ఉంటుంది. ఇది మంచి నిద్రకు సహాయపడుతుంది. అలాగే, పాలలో ప్రోటీన్, కాల్షియం కూడా ఎక్కువగా ఉంటాయి. ఇవి కండరాలకు మంచిగా పనిచేస్తాయి. అలాగే ఆకలిని కూడా నియంత్రిస్తాయి. ప్రతి రోజు పడుకునే ముందు 150%-%200 మి.లీ పాలు తాగడం మంచిది.

**గింజలు (బాదం, వాల్‌నట్స్)**

గుప్పెడు బాదం లేదా 2%-%3 వాల్‌నట్స్ తినడం మంచిది. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, ప్రోటీన్‌ను కలిగి ఉంటాయి. బాదంలో మెగ్నీషియం ఉండటం వల్ల ఇది ఒత్తిడిని తగ్గించి నిద్రకు సహాయపడుతుంది. వీటిని తినడం వల్ల తక్షణమే ఆకలి తగ్గుతుంది. అలాగే రాత్రంతా చక్కెర స్థాయిలు స్థిరంగా ఉంటాయి.

**అరటిపండు**

అరటిపండులో పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ %బీ%6 ఉంటాయి. ఇవి కండరాలను సడలించడంతో పాటు నిద్రకు సహాయపడతాయి. అరటిపండు ఆకలిని తీరుస్తుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. రాత్రి పడుకునే ముందు ఒక చిన్న అరటిపండు తినవచ్చు. దీనిని పాలతో కలిపి తీసుకుంటే మరింత ఆరోగ్యకరంగా ఉంటుంది.

## రోగమేదైనా చికిత్సకు సిద్ధం..



### ఇంజెక్షన్ ఇవ్వడం..
### యాంటీబయాటిక్‌లు రాయడం
### అవసరమైతే సెలైన్ ఎక్కించడం
### పరిస్థితి విషమిస్తే చేతులెత్తేయడం
### నగరంలో ఆర్‌ఎంపీల తీరిది
### ఓ యువకుడి మృతితో వీరి లీలలు మళ్లీ వెలుగులోకి

హైదరాబాద్ సిటీ: కొవిడ్ వచ్చిందా... గుండెనొప్పా, ఛాతీలో మంటా లేదా గ్యాస్ట్రిక్ ఇబ్బందులా.. సమస్య ఏదైనా సరే చికిత్స చేస్తామంటున్నారు ఆర్‌ఎంపీలు. ఆరోగ్య పరిస్థితిపై అవగాహన లేకుండా ఓ ఇంజెక్షన్ ఇచ్చి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఏదైనా సమస్యతో వస్తే సెలైన్ ఎక్కించడం, లేదా ఒకరోజు క్లినిక్‌లో అడ్మిట్ చేసుకుని తెలిసీ తెలియని వైద్యం చేసి వారి ప్రాణాల మీదకు తెస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఆరోగ్య పరిస్థితి విషమిస్తే చేతులు ఎత్తేసి గాయబ్ అవుతున్నారు. తాజాగా ఇటువంటి పరిస్థితే ఆల్వాల్‌లో ఓ యువకుడిని బలితీసుకుంది. నిజానికి ఆర్‌ఎంపీలు కేవలం ఫస్ట్ ఎయిడ్ వైద్యం అందించాలి. ఎవరికైనా గాయాలైతే ఆ భాగంలో శుభ్రం చేసి కట్టుకట్టాలి. అవసరమైతే ఆస్పత్రికి రెఫర్ చేయాల్సి ఉంటుంది. కానీ, తమ వద్దకు ఏ రోగి వచ్చినా వైద్యం అందిస్తున్నారు. సాధారణ జ్వరం నుంచి కొవిడ్ వరకు అన్నిరకాల వైద్యాన్ని అందిస్తూ వస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో అనేకమంది ఈ రకం వైద్యం నిర్వహిస్తున్నారు. శివారు ప్రాంతాల్లోనే కాదు, నగరం నడిబొడ్డులో ఈ నకిలీ వైద్యుల దందా జోరుగా సాగుతున్నది.

**యథేచ్ఛగా యాంటీబయాటిక్‌ల వినియోగం**

క్లినిక్‌కు ఎవరైనా రోగి రాగానే యాంటీబయెటిక్ లేదా ఇంజెక్షన్లు ఇస్తున్నారు. బాగా నీరసంగా ఉన్న వ్యక్తులకు క్లినిక్‌లోనే సెలైన్ కూడా ఎక్కిస్తున్నారు. ప్రైవేట్ ల్యాబ్ నిర్వాహకులతో సంబంధాలు పెట్టుకుని వ్యాధి నిర్ధారణ కు నమునాలను సేకరిస్తున్నారు. ఇలా అన్నిరకాల వైద్య సేవలను అందించి ప్రాణాలకు ముప్పు తెస్తున్నారు. ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పేరుతో..చాలాచోట్ల ఫస్ట్‌ఎయిడ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి అన్ని రకాల వైద్య చికిత్సలు అందిస్తున్నారు. నిజానికి ఫస్ట్ ఎయిడ్‌లో శిక్షణ పొందిన వారు సెంటర్లు ఏర్పా టు చేసుకోవచ్చు. ఎవరికైనా గాయాలు అయినపుడు, ప్రమాదాల్లో దెబ్బలు తగిలినప్పుడు తమ సెంటర్‌లో ప్రాథమిక వైద్యం అందించవచ్చు. కానీ సెంటర్ నిర్వాహకులు కూడా తమ పేరు పక్కన డాక్టర్ అని తగిలించుకుని చికిత్సలు చేస్తున్నారు. ఇక పాతబస్తీలో కొన్నిచోట్ల వనమూలికలతో చికిత్స అందిస్తున్నారు. వీరిపై అజమాయిషీ చేసే వారు లేకపోవడం, తనిఖీలు నిర్వహించకపోవడంతో వారు ఆడిందే ఆటగా క్లినిక్‌లు పనిచేస్తున్నాయి.పాతబస్తీ, శివారు ప్రాంతాల్లోపాతబస్తీలో 30 మంది వరకు నకిలీ డాక్టర్లు ఉన్నట్లు ఒక అంచనా. ఇది కేవలం దృష్టికి వచ్చిన కేసులు మాత్రమే. వందల సంఖ్యలో నకిలీ వైద్యులు క్లినిక్‌లు తెరిచి వైద్యం అందిస్తున్నట్లు తెలుస్తోంది. బొల్లారం, బోయిన్‌పల్లి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, షాపూర్‌నగర్, బోరబండ, రహ్మత్‌నగర్, మెహిదీటపట్నం, పాతబస్తీ, తదితర ప్రాంతాల్లో నకిలీ వైద్యానికి అడ్డూ అదుపు లేకుండా పోతుంది. ఓ డాక్టర్ దగ్గర లేదా ఓ నర్సింగ్ హోమ్‌లో నర్స్‌గా పనిచేస్తే చాలు.. ఆ కాస్త అనుభవంతో వైద్యం చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నగరంలో జరిగిన కొన్ని సంఘటనలు - తాజాగా బొల్లారం రిసాలబజార్‌కు చెందిన విఘ్నేశ్వర నేశ్వర్ కుమార్‌కు ఆదివారం రాత్రి భోజనం తర్వాత గ్యాస్ట్రిక్ సమస్య రావడంతో స్థానిక ఆర్‌ఎంపీని సంప్రదించగా, ఓ ఇంజక్షన్ ఇవ్వడంతో ఇంటికి వచ్చిన తర్వాత అతను ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. చికిత్స కోసం ఆస్పత్రి తరలించగానే చనిపోయినట్లు నిర్ధారించారు. - పాతబస్తీలో ఓ బాలికకు జ్వరం వస్తే సమీపంలోని ఓ క్లినిక్‌కు తీసుకెళ్లి చూయించారు. అక్కడ మహిళా డాక్టర్ పరీక్షలు చేసి ఇంజెక్షన్ చేసి పంపించారు. మరుసటి రోజు ఆ బాలిక పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారడంతో బస్తీ వాసులు సదరు డాక్టర్‌ను నిలదీశారు. ఆరా తీస్తే వైద్యం చేసిన డాక్టర్ నకిలీ వైద్యురాలని తేలింది.- 2017 సెప్టెంబరు 11న నార్సింగ్‌లో తీవ్ర జ్వరం వచ్చిన బాలికను సమీపంలోని పద్మావతి క్లినిక్‌కు తీసుకెళ్లి చూయించారు. అక్కడ డాక్టర్‌గా చలామణి అవుతున్న ఒకరు ఇంజెక్షన్ చేసి, మందులు ఇచ్చి పంపించారు. రెండు రోజుల తర్వాత ఆ బాలిక పరిస్థితి విషమించింది.- కొవిడ్ సమయంలో చందానగర్‌లో ఓ వ్యక్తికి జలుబు, దగ్గు, అయాసం రావడంతో ఓ ఆర్‌ఎంపీ తన క్లినిక్‌లో చేర్చుకుని వైద్యం చేశారు. పరిస్థితి విషమించడంతో హుటాహుటీన చెస్ట్ ఆస్పత్రికి తరలించారు.

## పప్పులే కాదు.. భూమికి బలాన్నీ ఇస్తాయి!



ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో తొలకరి జల్లులు పడుతున్నాయి. వీటిని ఆసరాగా చేసుకొని రైతులు పెసర, మినుము విత్తనాలు వేసుకుంటున్నారు. మార్కెట్‌లో పప్పు ధాన్యాలకు మంచి రేటు పలుకుతుండడంతో చాలా మంది రైతన్నలు ఇప్పుడు వీటి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. పైగా ఇవి అతి తక్కువ కాలంలో చేతికొస్తాయి. గాలిలోని నత్రజనిని రైజోబియుం బాక్టీరియా సాయంతో స్థిరీకరించి, పంట ఎదుగుదలకు దోహదపడడంతో పాటు ఎకరానికి 16-20 కిలోల నత్రజని ఎరువును అందిస్తాయి. పంట తీసుకున్న తర్వాత భూమిలో కలియదున్నితే పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగపడి భూసారాన్ని పెంచుతాయి. రైతులు మేలైన రకాలను ఎంచుకొని, తగిన యాజమాన్య చర్యలు చేపట్టినట్లయితే మంచి దిగుబడులు పొందవచ్చునని సూచిస్తున్నారు కరీంనగర్ జిల్లా పొలాస వ్యవసాయ పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటయ్య. ఆ వివరాలు...

**పెసర వంటే ఎందుకు?**

పెసరను పంటమార్పిడి పైరుగా, అంతరపంటగా కూడా వేసుకోవచ్చు. ఆయుకట్టు ప్రాంతాలలోనూ, చెరువులు-వ్యవసాయ బావులు వంటి నీటి వనరుల కింద వరి పండించే భూముల్లోనూ ముందుగా పెసర వేసుకొని, ఆ తర్వాత వరి వేసుకోవచ్చు. అయితే పైరు ఒకేసారి కోతకు రాకపోవడం, చీడపీడలకు సులభంగా లోనవడం వంటి చిన్న చిన్న సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. పెసరను అన్ని రకాల నేలల్లో సాగు చేయువచ్చు. కానీ చౌడు నేలలు, మరుగు నీరు నిలిచే భూములు పనికిరావు.

**అనువైన రకాలివే**

ఎల్‌జీజీ-407 రకం పంటకాలం 70-75 రోజులు. మొక్కలు నిటారుగా పెరిగి కాయులు మొక్క పైభాగాన కాస్తార్ను. గింజలు మెరుస్తూ వృధ్యస్థ లావుగా ఉంటార్ను. ఈ రకం ఎల్లో మొజార్నుక్, నల్ల ఆకువుచ్చ తెగుళ్లను తట్టుకుంటుంది. ఎల్‌జీజీ-410 రకం 75 రోజుల పంట. మొక్కలు నిటారుగా, గుబురుగా పెరుగుతార్ను. గింజలు పెద్దవిగా మెరుస్తూ ఉంటారు. పైరు ఒకేసారి కోతకు వస్తుంది. ఎల్‌జీజీ-450 రకం పైరు 65-70 రోజుల్లో కోతకు వస్తుంది. మొక్కలు వుధ్యస్థ ఎత్తులో ఉండి, గుబురుగా కన్పిస్తార్ను. పంట చేతికొచ్చే సవుయంలో వర్షాలు కురిసినప్పటికీ గింజలు కొంతమేర చెడిపోవు.

పూసా-105 రకం పంటకాలం 65-70 రోజులు. ఇది అన్ని ప్రాంతాలకూ అనువైనది. కాయులన్నీ పైభాగంలోనే ఉండి ఒకేసారి కోతకు వస్తాయి. ఈ రకం పల్లాకు, ఆకువుచ్చ తెగుళ్లను కొంతమేర తట్టుకుంటుంది. ఎంజీజీ - 295 రకం 65-70 రోజుల పంట. మొక్కలు నిటారుగా పెరుగుతార్ను. ఈ రకం నల్లవుచ్చ తెగులును తట్టుకుంటుంది. గింజ వుధ్యస్థ లావుగా ఉండి మెరుస్తూ ఉంటుంది. డబ్ల్యూజీజీ-37 రకం పంటకాలం 60-65 రోజులు. గింజలు ఆకర్షణీయుంగా, పచ్చగా మెరుస్తుంటారు. దీనిని అన్ని ప్రాంతాల్లో సాగు చేయువచ్చు. పైరు ఒకేసారి కోతకు వస్తుంది. ఎల్లో మెజారుక్ తెగులును తట్టుకుంటుంది.

ఎల్‌జీజీ-460 రకం 60-65 రోజుల పంట. కాయులు గుత్తులుగా ఉండి కోయుడానికి సులువుగా ఉంటుంది. పల్లాకు తెగులును తట్టుకుంటుంది. ఎంఎల్-267 రకం 65 రోజుల పంట. అన్ని ప్రాంతాలకూ అనువైనది. మొక్క నిటారుగా ఉండి కింది నుండి పై దాకా కాస్తుంది. పెసర రకాలన్నీ ఎకరానికి 4 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడిని అందిస్తాయి.

**తేమను నిలువుకునే నేలల్లో...**

మినుమును నల్లరేగడి భూవుల్లో పొగాకు పంటకు వ్నుందు ఎక్కువగా సాగు చేస్తారు. పంటల సరళిలో దీనిని పంటవూర్పిడి పైరుగా, అంతరపంటగా వేస్తారు. అయితే తొలకరిలో వేసే మినువ్ను పంట నీటి ఎద్దడిని త ట్టుకోలేదు. కాబట్టి తేవును నిలుపుకోలేని తేలికపాటి భూవ్నులు, ఎర్ర నేలలు మినువ్ను సాగుకు పనికిరావు. ఖరీఫ్ పైరుకు పల్లాకు, ఆకుముడత తెగుళ్లు ఎక్కువగా సోకుతాయి.

**ఈ రకాలు వేసుకోవచ్చు**

ఎల్‌బీజీ-20 రకం ఆకులు సన్నగా, పొడవుగా వ్నుదురాకుపచ్చ రంగులో ఉంటార్ను. ఈ రకం పల్లాకు తెగులును తట్టుకుంటుంది. గింజలు నల్లగా మెరుస్తుంటార్ను. పైరు 70-75 రోజుల్లో కోతకు వస్తుంది. ఎకరానికి 6 క్వింటాళ్ల దిగుబడి ఇస్తుంది. డబ్ల్యుబీజీ-26 రకం మొక్కలు గుబురుగా, పొట్టిగా ఉంటార్ను. గింజలు సాదాగా ఉంటారు. ఈ రకం పల్లాకు తెగులును కొంతమేర తట్టుకోగలదు. దీని పంటకాలం 70-75 రోజులు. ఎకరానికి

**సుమారు 5 క్వింటాళ్ల దిగుబడి ఇస్తుంది.**

ఎల్‌బీజీ-623 రకం కాయులు పొడవుగా, లావుగా ఉంటాయి. వాటి పైన నూగు చాలా తక్కువగా ఉంటుంది. గింజలు లావుగా మెరుస్తూ ఉంటార్ను. మొక్కలు గుబురుగా పెరుగుతార్ను. ఈ రకం బూడిద తెగులును కొంతమేర తట్టుకుంటుంది. దీని పంటకాలం 75-80 రోజులు. ఎకరానికి 7 క్వింటాళ్లకు పైగా దిగుబడిని అందించగలదు. టీ-9 రకం మొక్కలు గుబురుగా, పొట్టిగా ఉంటార్ను. ఆకులు సన్నగా, వ్నుదురాకుపచ్చ రంగులో ఉంటారు. దీని పంటకాలం 70-75 రోజులు. ఎకరానికి 6 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది.

**సాగు ఇలా...**

పెసర పంటకు ఎకరానికి 6-7 కిలోలు, మినుముకు 8-10 కిలోల విత్తనాలు అవసరమవుతాయి. వరుసల మధ్య 30 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 10 సెంటీమీటర్ల దూరం ఉండేలా విత్తుకోవాలి. విత్తడానికి ముందు కిలో విత్తనాలకు 30 గ్రాముల కార్బోఫ్యూరాన్ మందును పట్టించి శుద్ధి చేయాలి. పైరును తొలి దశలో రసం పీల్చే పురుగుల బారి నుంచి రక్షించుకునేందుకు కిలో విత్తనాలకు 5 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్/థయోమిథాక్సామ్ చొప్పున కలపాలి. ఈ పైర్లను కొత్తగా సాగు చేసే వారు రైజోబియం కల్చర్‌ను కూడా కలిపితే మంచి దిగుబడులు వస్తాయి.

టుడే
# ఏరువాక

## ముదిరిన తోటల్లో ఆహార భద్రత సాధ్యమేనా?



'అర ఎకరంలో ఒక కుటుంబానికి కావలసిన అన్ని రకాల ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు, పప్పులు, నూనెగింజలు, ధాన్యాలు అన్నపూర్ణ పంటల పద్ధతి ద్వారా పండించుకోవచ్చని 'సాక్షి-సాగుబడి'లో ప్రచురితమవుతున్న వ్యాసాల ద్వారా మాకు భరోసా కలిగింది. కానీ, మామిడి వంటి పండ్ల మొక్కలు ఏటేటా పెరుగుతున్న కొలదీ కొమ్మలు విస్తరించి మట్టి పరుపులన్నిటికీ నీడ వ్యాపిస్తుంది. దీని వలన అప్పటి వరకు మట్టి పరుపుల్లో సాగవుతున్న కూరగాయల నుంచి, ఇతర పంటల నుంచి వస్తున్న దిగుబడులు తగ్గి, ఆ మేరకు ఫలసాయం.. ఆదాయం తగ్గుతుంది. అప్పుడు కుటుంబ ఆహార భద్రత ఎలా సాధ్యపడుతుంది? వందలాది మంది రైతు సోదరులు, సోదరీమణులు ఈ సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు.ఈ ప్రశ్నలో చాలా వాస్తవముంది. అయితే, పంటలకు కావలసిన సూర్యరశ్మిని బట్టి, పండ్ల చెట్లకు కత్తిరింపు పద్ధతులను అనుసరిస్తూ సాగు చేయడం వలన ఇది వరకు పండిస్తున్న పంటలను కొనసాగిస్తూనే పండ్ల మొక్కల నుంచి కూడా అధిక దిగుబడులను సాధించవచ్చు. పండ్ల చెట్ల నీడ విస్తరించడం వలన అధిక సూర్యరశ్మి అవసరమయ్యే కూరగాయల దిగుబడి ఏటేటా తగ్గుతూ వస్తూంటుంది. అందు వలన చెట్ల కింద పెరిగే పసుపు, అల్లం, చేమదుంపలను సాగు చేసుకోవాలి. అయితే, వీటి పంట కాలం 6 నెలల నుంచి 9 నెలల దీర్ఘకాలం ఉండడం వలన కూరగాయల నుంచి వచ్చినంత ఆదాయం వీటి ద్వారా రాదు.కానీ, మొదటి సంవత్సరంలో 9 అడుగుల దూరంలో వేసుకున్న అరటి, బొప్పాయి వంటి పండ్ల మొక్కల నుంచి అదనపు ఆదాయం రావడం మొదలవుతుంది. రెండు, మూడో సంవత్సరాల నుంచి 18 అడుగుల దూరంలో వేసుకున్న జామ, సపోటా, బత్తాయి, నిమ్మ చెట్ల నుంచి కూడా ఫలసాయం.. ఆదాయం రావడం మొదలవుతుంది. 4-5 సంవత్సరాల వయసు వచ్చే సరికి ప్రధాన పండ్ల జాతికి చెందిన మామిడి చెట్ల నుంచి ఫలసాయం.. ఆదాయం రావడం మొదలవుతుంది. ఇది కూరగాయల పంటల నుంచి తగ్గిన ఫలసాయం.. ఆదాయం కంటే ఎక్కువే.






టుడే వినోదం

# కూలీ సంచలనం.. రైట్స్‌తో రికార్డుల మోత

సూపర్‌స్టార్ రజనీకాంత్ 171 చిత్రంగా డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ కలయికలో బంగారం స్మగ్లింగ్ నేపథ్యంలో రూపొందుతున్న రూపొందుతున్న చిత్రం కూలీ . భారీ బడ్జెట్‌తో ఎన్నో అంచనాల మధ్య తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నాగార్జున , ఉపేంద్ర , షౌబిన్ , సత్యరాజ్, శృతిహాసన్ వంటి సౌత్ ఇండియా సూపర్ స్టార్లు కీలక పాత్రలు పోషించగా అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించాడు. సన్ పిక్చర్స్ నిర్మించింది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఆగస్టులో 14న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమానుంచి ఇటీవల విడుదల చేసిన గ్లిమ్స్ సినిమాపై అమాంతం అంచనాలు పెంచగా.. ఆ వీడియోలో రజనీ మినహా ఏ హీరో ముఖం డైరెక్టుగా కనిపించకుండా జాగ్రత్తలు తీసుకోవడం విశేషం.ఇదిలాఉంటే ఈ సినిమా విదేశీ రైట్స్ విషయంలో ఆసక్తికర విషయాలు తెలుస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో ఈ వార్త హాట్ టాపిక్ అయింది. బాక్సాఫీస్ వద్ద 'కూలీ' చిత్రం విదేశీ రైట్స్ ధర సరికొత్త రికార్డు నెలకొల్పనుంది. ప్రస్తుతం విదేశీ పంపిణీ హక్కుల బిజినెస్ ప్రారంభమైన క్రమంలో ఈ మూవీ రైట్స్ సొంతం చేసుకునేందుకు ప్రముఖ సంస్థ ఏకంగా రూ. 70 నుంచి రూ. 80 కోట్ల మేర చెల్లించేందుకు ముందుకొచ్చిందని వినికిడి. అయినప్పటికీ చిత్ర నిర్మాత కళానిధి మారన్ మరింత అధిక మొత్తాన్ని డిమాండ్ చేస్తున్నారని దాంతో ఈ ఫారిన్ రైట్స్ బిజినెస్ చర్చలు ఇంకా నడుస్తూనే ఉన్నాయని ఈ నెలాఖరున అన్నీ ఫైనల్ అవుతాయని సమచారం. ఈ సినిమా హక్కులను రూ. 70 కోట్ల నుంచి రూ. 80 కోట్లకు విక్రయిస్తే మాత్రం.. తమిళ చిత్ర పరిశ్రమలో ఈ రైట్స్ సరికొత్త మైలురాయిగా నిలుస్తుందని కోలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి.

# రష్మికతో కలిసి మళ్లీ దొరికిపోయాడు...




టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండనేషనల్ క్రష్ రశ్మిక మందణ్ణ మధ్య సాగుతున్న ప్రేమాయణం గురించి ఇవాళ కొత్తగా చెప్పుకోవాల్సిందేమీ లేదు. కొన్నేళ్ళుగా సాగుతున్నదే. అయితే తమ ఇద్దరి మధ్య ఉన్న ప్రేమానుబంధం గురించి రశ్మిక బయటపడినట్టుగా విజయ్ దేవరకొండ మాత్రం బయట పడటం లేదు. వ్యూహాత్మక మౌనాన్ని పాటిస్తున్నాడు. %రశ్మిక మాత్రం అవకాశం కుదిరినప్పుడల్లా విజయ్ ఫ్యామిలీతో తనకున్న బాండింగ్ ను విడమర్చి, విపులంగా చెబుతోంది. ఎవరు ఆ రిలేషన్ షిప్ గురించి ప్రశ్నించినా... సంకోచం లేకుండా దాచుకోకుండా డైరెక్ట్ గా చెప్పడం లేదు కానీ ఇన్ డైరెక్ట్ గా అందరికీ తెలిసిందేగా అనేస్తోంది. రశ్మిక ఎప్పుడు విదేశాలకు వెళ్ళినా... ఆమె చుట్టు పక్కల విజయ్ దేవరకొండ లేదా అతని ఫ్యామిలీ మెంబర్స్ ఉన్నారా? అని పరికించి చూడడం అందరికీ అలవాటైపోయింది. అలానే విజయ్ దేవరకొండ ఫారిన్ ట్రిప్ వేసినా... అదే ప్లేస్ కు రశ్మిక కూడా వెళ్ళే ఉంటుందనే సందేహంతో ఆమె సోషల్ మీడియాను సెర్చ్ చేయడం కామన్ అయిపోయింది. ఏ మాత్రం హింట్ దొరికినా... ఇద్దరు ప్రేమికులు

# సడన్‌గా ఓటీటీకి.. బాలయ్య బ్యూటీ లేటెస్ట్ బోల్డ్ మూవీ




ఇటీవలే థియేటర్‌లో విడుదలైన ఓ డిఫరెంట్ బ్లాక్ కామెడీ థ్రిల్లర్ చిత్రం సిస్టర్ మిడ్‌నైట్ రెండు వారాలకే సడన్‌గా డిజిటల్ స్ట్రీమింగ్‌కు వచ్చి ఆశ్చర్య పరిచింది. లెజెండ్‌లో బాలయ్య సరసన చేసిన బ్యూటీ రాధికా ఆప్టే, అశోక్ పాఠక్, ఛాయా కదం, స్మితా తాంబే కీలక పాత్రల్లో నటించగా కరణ్ కాందహారి దర్శకత్వం వహించాడు. అయితే.. అమెరికన్స్ అలిస్టర్ క్లార్క్, అన్నా గ్రిఫ్ నిర్మించగా ఇతర అన్ని విభాగాల్లోనూ సంగీతంతో సహా అంతా హాలీవుడ్ టెక్నీషియన్స్ పని చేయడం విశేషం. మే30న థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం పాజిటివ్ టాక్ తెచ్చుకున్నప్పటికీ సరైన పబ్లిసిటీ లేక జనాలకు చేరలేక ఒక వర్గం ప్రేక్షకులకు మాత్రమే కనెక్ట్ అయింది. అసలు ఇదో సినిమా ఉందని, రిలీజ్ అయిన సంగతి కూడా చాలా మందికి తెలియదు. అయితే ఇప్పుడు ఈ చిత్రం ఓటీటీకి వచ్చి షాక్ ఇచ్చింది. కాకపోతే ఇక్కడో మతలబు ఉంది. స్టోరీ విషయానికి వస్తే.. పెద్దలు కుదర్చగా పెళ్లి చేసుకున్న ఓ జంట (ఉమ, గోపాల్) ముంబైలోని ఓ స్లమ్‌లో కొత్తగా కాపురం పెడతారు. అయితే ఈ వివాహం ఇష్టం లేని ఉమ భర్తతో అంతగా మింగిల్ కాలేకపోతుంది. అదే సమయంలో ఇంట్రోవర్ట్ అయిన భర్త గోపాల్ సైతం భయస్తుడిగా ఉంటూ భార్యను చూడడానికి, తాకడానికి కూడా ఇబ్బంది పడుతుంటాడు. దీంతో ఉమ ఏం చేయాలో తెలియక ఓ ఆఫీస్‌లో ఫ్లోర్ క్లీనింగ్ పనిలో చేరుతుంది. ఆయితే భర్త అంటీ ముట్టనట్లు ఉండడంతో తనకు ఉన్న ఆ వివరీతమైన వాంఛను తీర్చుకోలేక బయటకి చెప్పుకోలేక లోలోన మదన పడిపోతూ అనారోగ్యం పాలవుతుంది. ఓరోజు ఎలాగోలా ధైర్యం చేసి భర్తతో ఆ కార్యం కాస్త పూర్తి చేశాక వృునే పుడున్న భరత్త తెల్లారి లేచి చూసే సరికి చనిపోయి ఉంటాడు.దీంతో ఉమ ఏం చేసింది, తర్వాత ఒంటరిగా తన ప్రయాణం ఎలా సాగింది, ఎన్ని మలుపులు తిరిగిందనేదే కథ.

# పరాజయాల్లో డబుల్ హ్యాట్రిక్




త్రిష కృష్ణన్ కెరీర్ కు ఫుల్ స్టాప్ పడిందని అందరూ అనుకుంటున్న సమయంలో ఫినిక్స్ పక్షిలా ఉవ్వెత్తున పైకి లేస్తూ వస్తోంది. నాలుగు పదుల వయసులోనూ క్రేజీ ప్రాజెక్ట్స్ ను అందిపుచ్చుకుంటూ తన అభిమానులను అలరిస్తోంది. విజయ్ సేతుపతి '96' సినిమాలో కొత్త త్రిషను చూశారు సినీ జనం. ఆమె అభిమానులు సైతం త్రిషలోని ఆ క్యూట్ యాంగిల్ ను చూసి అవాక్కయ్యారు. మళ్ళీ మరోసారి ఆమెను ఆరాధ్యదేవతగా కొలవడం మొదలు పెట్టారు. అలా త్రిష తిరిగి లైమ్ లైట్ లోకి వచ్చేసింది. ఈ మధ్య కాలంలో ఇంత లాంగ్ రన్ కెరీర్ ను ఎంజాయ్ చేసిన హీరోయిన్లు పెద్దంతగా కనబడటం లేదు. %ప్రముఖ దర్శకుడు మణిరత్నం తెరకెక్కించిన 'పొన్నియన్ సెల్వన్' రెండు భాగాలలోనూ త్రిష కీలక పాత్రలను పోషించింది. ఐశ్వర్యారాయ్, ఐశ్వర్య లక్ష్మీ, శోభిత దూళిపాళ్ల తదితరులు ఇందులో నటించినా... వీరందరి కంటే త్రిష పాత్రకే అత్యధిక ప్రాధాన్యం ఆ రెండు భాగాల్లోనూ ఉంది. ఆ సినిమా ఆశించిన స్థాయిలో ఘన విజయం సాధించకపోయినా... ఫర్వాలేదనిపించింది. అయితే... ఆ తర్వాత వరుసగా త్రిష పరాజయాలనే చవిచూస్తూ వచ్చింది. 'పొన్నియన్ సెల్వన్ -2' తర్వాత వచ్చిన థ్రిల్లర్ మూవీ 'ది రోడ్' పరాజయం పాలైంది. ఉమెన్ సెంట్రిక్ గా తెరకెక్కిన ఈ సినిమా త్రిషకు ఎలాంటి గుర్తింపు తెచ్చిపెట్టలేదు. ఆ తర్వాత వచ్చిన దళపతి విజయ్ 'లియో' సైతం త్రిషను నిరాశ పర్చింది. విజయ్ కు ఉన్న ఫ్యాన్ బేస్ కారణంగా మూవీకి ఓపెనింగ్స్ వచ్చినా... అది కూడా ఆశించిన స్థాయిలో ఆడలేదు. విజయ్ మరో సినిమా 'గోట్'లో త్రిష అతిథిపాత్రలో మెరిసింది. ఈ సినిమా బాక్సాఫీస్ బరిలో ఫర్వాలేదనిపించింది కానీ ఆ విజయాన్ని త్రిష ఖాతాలో వేయలేదు. ఇక ఆ తర్వాత మలయాళ చిత్రం 'ఐడెంటిటీ'లో త్రిష కీలక పాత్రను పోషించింది. ఇది కూడా ఎబౌ ఏవరేజ్ మూవీగానే ఉండిపోయింది. దీని తర్వాత అజిత్ హీరోగా నటించిన రెండు సినిమాల్లో త్రిష నటించింది. అందులో మొదటిది 'విడముయార్చి' కాగా రెండోది 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. బ్యాక్ టు బ్యాక్ వచ్చిన ఈ రెండు సినిమాలు అభిమానులను ఆకట్టుకోవడంలో విఫలమయ్యాయి. దాంతో ఈ యేడాది వచ్చిన మూడు సినిమాలూ త్రిషకు బ్యాడ్ ఎక్స్ పీరియన్స్ నే ఇచ్చాయని చెప్పాలి.

# నాకు నటించడమే రాదన్నారు



శతమానం భవతి', కార్తికేయ 2' లాంటి పలు సూపర్ హిట్ చిత్రాల్లో కథానాయికగా తెలుగు ప్రేక్షకులను అలరించారు అనుపమ పరమేశ్వరన్. ఆమె నటించిన 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' అనే మలయాళ చిత్రం ఈనెల 27న విడుదలవుతోంది. ఇందులో లాయర్‌గా సురేశ్ గోపీ నటించారు. ఈ సినిమా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న అనుపమ మాట్లాడుతూ 'నాకు నటన రాదంటూ చాలా మంది ట్రోల్ చేశారు. అయినా దర్శకుడు ప్రవీణ్ నాకు అవకాశం ఇచ్చారు. 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' వంటి గొప్ప చిత్రంలో ఎంపిక చేశారు. నాపై నమ్మకంతో ఇలాంటి పాత్రను ఇవ్వడమే నాకు దక్కిన విజయంగా భావిస్తున్నాను. ఇక నుంచి ప్రేక్షకులకు నచ్చే సినిమాలు మాత్రమే అంగీకరించాలని నిర్ణయించుకున్నా. కొవిడ్ సమయంలో నా కెరీర్ పరంగా, జీవితంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాను' అని చెప్పారు. కాగా, అనుపమ వ్యాఖ్యలపై సురేశ్ గోపీ స్పందించారు. ఒక నటిపై వివక్షను ప్రదర్శించడం మలయాళ ఫిల్మ్ ఇండస్ట్రీలో ఇదే తొలిసారి కాదని అన్నారు. 'అనుపమ మాట్లాడిన మాటలు ఆమె హృదయాంతరాళం నుంచి వచ్చాయి. గతంలో నటి నిఖ్రమన్ విషయంలోనూ ఇదే విధంగా జరిగింది. మలయాళ చిత్రపరిశ్రమ ఆమెను చిన్నచూపు చూసి ఇండస్ట్రీ వదిలిపోయేలా చేసింది' అని అన్నారు.

# ఈవారం ఓటీటీకి వచ్చే.. సినిమాలు, వెబ్ సిరీస్‌లివే




జూన్ మూడవ వారం ఓటీటీ లలో సినిమాలు, వెబ్ సిరీస్‌ల సందడి గట్టిగానే ఉండనుంది. ఈ క్రమంలో ఈ వార్ సుమారు 70,80 వరకు చిత్రాలు, సిరీస్‌లు డిజిటల్ స్ట్రీమింగ్ రానుండగా అందులో ఎక్కువ శాతం పరభాషా చిత్రాలే ఉండడం విచారకరం. వాటిలో తెలుగు డబ్ చేసినవి ఒకటి రెండు మాత్రమే ఉన్నాయి. వీటిలో ఇప్పటికే కొన్ని స్ట్రీమింగ్ అవుతుండగా రెండు మూడు రోజుల్లో మరిన్ని రానున్నాయి. వీటిలో ఫైనల్ డెస్టినేషన్, సిస్టర్ మిడ్‌నైట్ వంటి సినిమాలు కేరళ క్రైమ్ ఫైల్స్ లాంటి గుర్తింపు ఉన్న సిరీస్‌లు స్ట్రీమింగ్ అవనున్నాయి. %అయితే.. మన దేశవ్యాప్తంగా ఉన్న ఓటీటీ ప్లాట్ఫామ్స్‌తో పాటు అంతర్జాతీయంగా పేరెన్నికగన్న మరి కొన్ని ఓటీటీలలో స్ట్రీమింగ్‌కు రానున్ననినిమాల లిస్టును ఇక్కడ అందజేస్తున్నాం. సో.. ఓటీటీ లవర్స్ ఈ వీకెండ్ ఇక్కడ ఇచ్చిన లిస్టను చెక్ చేసుకుని మీకు నచ్చిన కంటెంట్‌ను మీకు నచ్చిన సమయంలో చూసి ఆస్వాధించండి. కాగా ఎప్పటిలానే అధి శాతం కంటెంట్ నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ వీడియోల్లోనే వస్తుండగా ప్రైమ్ వీడియోలోనూ సినిమాల మధ్యలో అడ్వర్టైజ్ మెంట్స్ రానున్నాయి.సినిమా థియేటర్లు

# టుడే స్పోర్ట్స్

## వైభవ్ ఫ్రెండ్ అయాన్ దుమ్మురేపాడు



ముజఫ్ఫర్‌పూర్ (బిహార్): ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీ స్ఫూర్తితో బిహార్‌కే చెందిన మరో చిచ్చరపిడుగు అయాన్ రాజ్ ట్రిపుల్ సెంచరీతో దుమ్మురేపాడు. డిస్ట్రిక్ క్రికెట్ మ్యాచ్‌లో సంస్కృతి క్రికెట్ అకాడమీ తరఫున 13 ఏళ్ల అయాన్ కేవలం 134 బంతుల్లో 327 పరుగులు సాధించాడు. అందులో 22 సిక్సర్లు, 41 ఫోర్లు ఉన్నాయి. అయాన్, వైభవ్ మంచి స్నేహితులు. వీరిద్దరూ కలసి ప్రాక్టీస్ కూడా చేసేవారు. 'వైభవ్ ఎంతో ఎత్తుకు ఎదిగాడు.

## మొదలైంది డబ్ల్యూటీసీ రేసు




దుబాయ్: రాబోయే రెండేళ్ల కోసం సరికొత్త వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప (డబ్ల్యూటీసీ) సైకిల్ మంగళవారం నుంచి ఆరంభమైంది. ఇందులో భాగంగానే శ్రీలంక-బంగ్లాదేశ్ జట్ల మధ్య తొలి టెస్టు జరుగుతోంది. ఇటీవల లార్డ్స్ మైదానంలో ఆస్ట్రేలియాను నాలుగు రోజుల్లోనే మట్టి కరిపించి దక్షిణాఫ్రికా తొలిసారి వరల్డ్ టెస్టు చాంపియన్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఆ పోరుతో 2023-2025 డబ్ల్యూటీసీ సీజన్ ముగిసింది. ఇక నాలుగో ఎడిషన్ కోసం మొత్తం తొమ్మిది జట్లు (భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇంగ్లండ్, పాకిస్థాన్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, బంగ్లాదేశ్, వెస్టిండీస్) పోటీపడుతున్నాయి. మరోవైపు అఫ్ఘానిస్థాన్, ఐర్లాండ్, జింబాబ్వే జట్లు ఆడే టెస్టులు మాత్రం డబ్ల్యూటీసీ కిందికి రావు. ప్రతీ జట్టుకు ఆరు సిరీసలు: డబ్ల్యూటీసీలో ప్రతీ జట్టు ఇంటా, బయటా కలిపి ఆరు సిరీస్‌లు ఆడుతుంది. ప్రతీ సిరీస్ కూడా రెండు నుంచి ఐదు టెస్టుల మధ్య ఉంటుంది. విజయాల ద్వారా గెలుచుకున్న పాయింట్లను బట్టి మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య ఫైనల్ జరుగుతుంది. మొత్తంగా రెండేళ్లలో ఈ తొమ్మిది జట్లు 27 సిరీసల్లో తలపడుతాయి. ఇంగ్లండ్ అత్యధికంగా 21 మ్యాచ్‌లు ఆడనుండగా.. ఆ తర్వాత ఆసీస్ (20), ఇండియా (18) ఉన్నాయి. ఇందులో గిల్ సేన స్వదేశంలో తొమ్మిది టెస్టులు మాత్రమే ఆడనుంది. లండన్: నాలుగు రోజుల టెస్ట్‌లకు ఐసీసీ సుముఖత వ్యక్తం చేసిందని సమాచారం. అయితే, చిన్న జట్లకు మాత్రమే ఇది వర్తించనుంది. 2027-29 వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప (డబ్ల్యూటీసీ) సీజన్‌లో చిన్న దేశాలు ఎక్కువ టెస్ట్‌లు ఆడేందుకు అనుగుణంగా టెస్టు ఫార్మాట్‌లో ఓ రోజును తగ్గించనున్నారు. కానీ, భారత్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా లాంటి పెద్ద జట్లు సంప్రదాయ రీతిలో ఐదు రోజుల ఫార్మాట్‌లోనే ఆడాల్సి ఉంటుంది. ద్వైపాక్షిక సిరీసలో భాగంగా నాలుగు రోజుల టెస్ట్‌లకు ఐసీసీ 2017లోనే అనుమతించింది. 'ఐదు రోజులపాటు మ్యాచ్‌ను నిర్వహించడం చిన్నజట్లకు భారంగా మారింది. ఖర్చు పెరుగుతుండడంతో ఆయా జట్లు అనాసక్తిని ప్రదర్శిస్తున్నాయి. కొత్త ఫార్మాట్‌లో అయితే వేగంగా సిరీస్ ముగిసే అవకాశాలుంటాయ'ని ఐసీసీ వర్గాలు తెలిపాయి. కాగా, 2025-27 డబ్ల్యూటీసీ సైకిల్‌లో మాత్రం ఐదు రోజుల మ్యాచ్‌లే జరగనున్నాయి.

## నాకూ ఫ్యామిలీ ఉంది.. డబ్బులు సంపాదించాలి..
## టెస్ట్ క్రికెట్‌పై బుమ్రా ఆసక్తికర వ్యాఖ్యలు



గతంలో టెస్ట్ క్రికెట్ అంటే ఎంతో గౌరవం ఉండేది. సుదీర్ఘ ఫార్మాట్‌లో సత్తా చాటిన వారినే ఉత్తమ క్రికెటర్లుగా పరిగణించేవారు. క్రమం తప్పకుండా టెస్ట్ మ్యాచ్‌లు జరుగుతుండేవి. అయితే ప్రస్తుతం పరిస్థితి మారిపోయింది. టెస్ట్ క్రికెట్‌కు ఆదరణ దాదాపుగా తగ్గిపోయింది. టెస్ట్ క్రికెట్‌కు ఆదరణ పెంచేందుకు ఐసీసీ ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా ఫలితం పెద్దగా ఉండడం లేదు. ప్రముఖ ఆటగాళ్లు కూడా టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించేస్తున్నారు. తాజాగా టీమిండియా స్టార్స్ అయిన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కూడా టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రపంచస్థాయి బౌలర్ అయిన జస్ప్రీత్ బుమ్రా కూడా టెస్ట్ క్రికెట్ ఆడేందుకు కాస్త వెనకడుగు వేస్తున్నాడు. త్వరలో ప్రారంభం కాబోతున్న ఇంగ్లండ్ టెస్ట్ సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉండలేనని తేల్చేశాడు. తాజాగా మాజీ ఆటగాడు దినేష్ కార్తీక్‌తో మాట్లాడిన బుమ్రా టెస్ట్ క్రికెట్‌పై తన మనసులో మాటలను బయటపెట్టాడు. టెస్ట్ క్రికెట్ ఆడాలా, వద్దా అనే విషయంలో ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ ఉండాలని అన్నాడు. 'టెస్ట్ క్రికెట్‌ను వదిలేయాలనుకునే వారి నిర్ణయాన్ని గౌరవించాలి. రెడ్ బాల్ క్రికెట్‌లోని ఒత్తిడిని తట్టుకునేందుకు శరీరం సిద్ధంగా లేకపోతే తప్పుకోవడం ఉత్తమం. టెస్ట్ క్రికెట్‌లో బౌలర్లు మరింత ఒత్తిడిని ఎదుర్కొంటారు. బౌలర్లు బ్యాట్ వెనుక దాక్కోలేరు. ఎంతో శ్రమ పడాల్సి ఉంటుంది. మనకూ కుటుంబాలు ఉన్నాయి. వారి కోసం డబ్బులు సంపాదించాలి. ఎవరైనా టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తే వారిని జడ్జ్ చేయడం ఆపాలి. అయితే టెస్ట్ క్రికెట్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరిస్తే మీకు ప్రపంచవ్యాప్తంగా గౌరవం లభిస్తుంది' అని బుమ్రా అన్నాడు. కొన్ని రోజుల క్రితం కోహ్లీ కూడా టెస్ట్ క్రికెట్ గురించి ఇలాంటి వ్యాఖ్యలే చేశాడు.

## టీమిండియా రైలెక్కింది



లీడ్స్: భారత క్రికెట్ జట్టు తొలి టెస్టు కోసం రైలు మార్గంలో లండన్ నుంచి లీడ్స్‌కు చేరుకొంది. మామూలుగా టీమిండి యా ఎక్కడ దిగినా అభిమానులు భారీ సంఖ్యలో అభివాదం చేస్తూ కనిపిస్తుంటారు. అయితే లీడ్స్‌లో మాత్రం పట్టుమని పదిమంది ఫ్యాన్స్ కూడా కనిపించలేదు. బెకెన్‌హామ్‌ను బేస్‌గా చేసుకొన్న టీమిండి యా.. భారత్-ఎతో ప్రాక్టీస్ మ్యాచ్ ఆడింది. కాగా, పేసర్ హర్షిత్ రాణాకు భారత జట్టులో చోటుదక్కింది. దీంతో అతడు జట్టుతో కలసి లీడ్స్‌కు చేరుకొన్నాడు. తొలుత ప్రకటించిన టీమ్‌లో రాణాకు చాన్స్ లభించలేదు. కానీ, భారత్-ఎ తరఫున ఆడేందుకు అతడు ఇంగ్లండ్ వెళ్లాడు. అయితే, మరో పేసర్‌కు కవర్‌గా రాణాను అక్కడే ఉండిపొమ్మన్నట్టు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో రాణా టెస్టుల్లో అరంగేట్రం చేశాడు.

## అందుకే కెప్టెన్సీ వద్దన్నా



లండన్: రోహిత్ శర్మ రిటైర్మెంట్‌తో భారత టెస్టు జట్టు పగ్గాలు వైస్‌కెప్టెన్‌గా ఉన్న జస్‌ప్రీత్ బుమ్రాకు అప్పగిస్తారని చాలామంది భావించారు. అయితే సెలెక్టర్లు మాత్రం అనూహ్యంగా శుభ్‌మన్ గిల్‌ను ఎంపిక చేశారు. దీంతో బుమ్రాను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదన్న చర్చ మొదలైంది. అయితే పనిఒత్తిడిని తగ్గించుకునేందుకే తాను ఆ బాధ్యతలను వద్దన్నట్టు బుమ్రా చెప్పాడు. 'రోహిత్, విరాట్‌ల రిటైర్మెంట్‌కు ముందే.. ఐపీఎల్ జరుగుతున్నప్పుడే నేను బీసీసీఐతో మాట్లాడా. ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌లో నాపై ఉండే వర్క్‌లోడ్ గురించి వారితో చర్చించా. అలాగే నాకు చికిత్స చేస్తున్న వైద్యుల సలహాలు కూడా తీసుకున్నా. వాస్తవానికి బోర్డు నన్ను కెప్టెన్‌గా చేసేందుకు సిద్ధపడింది. కానీ నేను సిరీస్ మొత్తం ఆడలేను. అలాంటప్పుడు ఒకే సిరీస్‌కు ఇద్దరు కెప్టెన్లు ఉండడం సరికాదు. అందుకే నేనే స్వయంగా ఫోన్ చేసి నాయకత్వ బాధ్యతలు వద్దని చెప్పా. నాకు కెప్టెన్సీ కన్నా క్రికెట్టే ఎక్కువ. ఓ ఆటగాడిగా మరింత సేవ చేసేందుకు ప్రయత్నిస్తాను' అని ఓ ఇంటర్వ్యూలో బుమ్రా వివరించాడు.

## బ్యాట్ పట్టి చెలరేగిన రింకూ కాబోయే సతీమణి.. వీడియో వైరల్!




టీమిండియా డాషింగ్ బ్యాటర్ రింకూ సింగ్ త్వరలో పెళ్లి పీటలెక్కనున్నాడు. ఎంపీ ప్రియా సరోజ్‌తో అతడికి ఇటీవలే నిశ్చితార్థం అయింది. జూన్ 8న లక్నోలో వైభవంగా జరిగిన ఈ నిశ్చితార్థ వేడుకకు భువనేశ్వర్ కుమార్, పీయుష్ చావ్లా, ప్రవీణ్ కుమార్ లాంటి స్టార్ క్రికెటర్లు తరలివచ్చారు. వీళ్లతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు కూడా ఈ వేడుకకు హాజరయ్యారు. గ్రాండ్‌గా జరిగిన ఈ నిశ్చితార్థ వేడుక తర్వాత నుంచి రింకూ కాబోయే సతీమణి ఫొటోలు, వీడియోలు నెట్టింట తెగ చక్కర్లు కొడుతున్నాయి. ఈ సమయంలో ప్రియా సరోజ్ క్రికెట్ వీడియోతో మరోమారు సోషల్ మీడియాను షేక్ చేసింది. ఇంతకీ ఏం జరిగిందంటే.. వారణాసిలోని ఓ మినీ స్టేడియం ప్రారంభోత్సవానికి హాజరైంది ప్రియా సరోజ్. ఈ సందర్భంగా అక్కడ ఉన్న పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఆమెను బ్యాటింగ్ చేయాల్సిందిగా కోరారు. దీంతో బ్యాట్ పట్టిన ప్రియా సరోజ్.. రెండు బంతుల్ని ఎదుర్కొంది. అయితే తొలి బంతికి ఆమె షాట్ గట్టిగానే కొట్టినా కనెక్ట్ కాలేదు. రెండో బంతిని మాత్రం సరిగ్గా చూసి లాఘవంగా కొట్టింది. బాల్ చాలా దూరం వెళ్లడంతో ఆమె నవ్వుల్లో మునిగిపోగా.. అక్కడనున్న వారు చప్పట్లతో అభినందించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇది చూసిన నెటిజన్స్.. రింకూ కాబోయే వైఫ్ సందడి మామూలుగా లేదుగా అని కామెంట్స్ చేస్తున్నారు. కాగా, ఈ ఏడాది నవంబర్ 18వ తేదీన రింకూ-ప్రియ వివాహం జరగనుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లు అప్పుడే మొదలయ్యాయని తెలుస్తోంది.

## మళ్లీ అగ్రపీఠంపై మంధాన



దుబాయ్: ఐసీసీ మహిళల వ్యక్తిగత వన్డే ర్యాంకింగ్స్‌లో భారత ఓపెనర్ స్మృతి మంధాన ఆరేళ్ల తర్వాత తిరిగి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. మంగళవారం విడుదలైన తాజా ర్యాంకింగ్స్‌లో స్మృతి 727 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచింది. ఇటీవల ముగిసిన ముక్కోణపు సిరీసలో 52 సగటుతో 264 పరుగులు సాధించడంతో ఆమె ర్యాంక్ మెరుగుపడింది. బ్రంట్ (ఇంగ్లండ్), లారా వోల్వార్ట్ (దక్షిణాఫ్రికా) 2, 3 ర్యాంకుల్లో ఉన్నారు. బౌలర్ల జాబితాలో ఎకెల్‌స్టోన్ (ఇంగ్లండ్), గార్డ్‌నర్ (ఆస్ట్రేలియా), మేగాన్ (ఆస్ట్రేలియా), దీప్తి శర్మ (భారత్) తొలి నాలుగు స్థానాల్లో కొనసాగుతున్నారు.

## విరాట్ ఇంటికి గిల్ పంత్



లండన్: భారత జట్టులోని కొందరు సభ్యులను టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ లండన్‌లోని తన ఇంటికి ఆహ్వానించాడు. కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్‌తోపాటు మహ్మద్ సిరాజ్ వారిలో ఉన్నారు. ఇంట్రాస్క్వాడ్ మ్యాచ్ తర్వాత విశ్రాంతి రోజైన సోమవారం ఈ క్రికెటర్లు దాదాపు రెండు గంటలపాటు కోహ్లీ ఇంట్లో గడిపారు. టెస్టులకు ఇటీవలే రిటైర్మెంట్ ప్రకటించిన విరాట్ యూకేలో సేదదీరుతున్నాడు. ఐదు టెస్ట్‌ల సిరీస్ కోసం ఇంగ్లండ్‌లో భారత జట్టు పర్యటిస్తున్న సంగతి తెలిసిందే.

టుడే బిజినెస్

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు.



బంగారం వెండి ధరలు ఆల్‌టైమ్ గరిష్టానికి చేరువలో ట్రేడ్ అవుతున్నాయి. భౌగోళికంగా ఉద్రిక్త పరిస్థితులే బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. అయితే నిన్నటితో పోల్చుకుంటే ఈ రోజు బంగారం ధరల్లో క్షీణత కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (జూన్ 18న) ఉదయం 6.00 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 1, 00, 360కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 91, 990కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే దాదాపు వెయ్యి రూపాయల మేర బంగారం ధర తగ్గింది.ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 00, 510కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 92, 140కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 00, 360కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 91, 990కి చేరింది. వెండి ధరలు కేజీకి రూ100 మేర పెరిగాయి.

# ప్రపంచంలో టాప్ 10 సురక్షిత విమానయాన సంస్థలు..
# ఎయిర్ ఇండియా ఉందా లేదా




ప్రపంచవ్యాప్తంగా విమానయాన సంస్థల భద్రతా ప్రమాణాలు నిర్ధారించడానికి ప్రతి సంవత్సరం ర్యాంకింగ్స్ ఇస్తుంది. ఈ నేపథ్యంలో విమాన ప్రయాణికులకు అనుగుణంగా పలు రకాల అంశాలతో జాబితాను విడుదల చేస్తుంది. అయితే ఈసారి 2025కు సంబంధించి కూడా కొత్త జాబితాను విడుదల చేయగా, అందులో ఏయే సంస్థలు ఉన్నాయో ఇప్పుడు చూద్దాం.

**ప్రపంచంలోని టాప్ 10 విమానయాన సంస్థలు**

Air New Zealand
Qantas
Cathay Pacific,
Qatar Airways,
Emirates
Virgin Australia
Etihad Airways
All Nippon Airways (ANA)
EVA Air
Korean Air
Alaska Airlines
Turkish Airlines

# నీట్ యూజీలో తక్కువ స్కోర్ ఉందా..
# పర్లేదు.. ఈ కోర్సుతో బంగారు భవిష్యత్తు మీదే!



నీట్ యూజీ పరీక్ష ద్వారా ఎంబీబీఎస్, బీడిఎస్ లకు మాత్రమే కాకుండా బీఏఎంఎస్ కోర్సులో కూడా ప్రవేశం కల్పిస్తారు. నీట్ పరీక్షలో తక్కువ స్కోర్ చేసిన విద్యార్థులకు బీఏఎంఎస్ కోర్సు ఒక అద్భుత అవకాశం. ఈ కోర్సు పూర్తి చేస్తే కచ్చితంగా కెరీర్ లో ఉన్నతస్థాయికి చేరుకుంటారు. బీఏఎంఎస్ పూర్తి చేసిన అనంతరం ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రైవేట్ ప్రాక్టీస్ రెండూ చేయవచ్చు. ఈ కోర్సులో ప్రవేశం పొందడానికి కటాఫ్ ఎంత అనేది ఇక్కడ తెలుసుకుందాం..

లో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వీరికి చాలా సులువుగా BAMS (ఆయుర్వేద) కోర్సులో ప్రవేశం లభిస్తుంది. ప్రభుత్వ కళాశాలలకు 550ం మార్కులు (జనరల్) అవసరం అయితే, SC/ST విద్యార్థులకు 440 మార్కులు సరిపోతాయి. BAMS గ్రాడ్యుయేట్లకు మెడికల్ ఆఫీసర్, ఆయుర్వేద స్పెషలిస్ట్, రీసెర్చ్ ఆఫీసర్ వంటి ప్రభుత్వ ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి. ప్రైవేట్ ప్రాక్టీస్‌కు కూడా అవకాశం ఉంది.

**BAMS అంటే ఏమిటి?**

BAMS అంటే బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ. ఈ డిగ్రీ కోర్సు వ్యవధి 5.5 సంవత్సరాలు. విద్యార్థులు 4.5 సంవత్సరాలు అధ్యయనం, ఒక సంవత్సరం ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. ఈ కోర్సులో ఆయుర్వేద, ఆధునిక వైద్యం రెండింటినీ బోధిస్తారు. BAMS పూర్తి చేసిన వారు ఆయుర్వేద వైద్యులు అవుతారు.

**నీట్ ప్రవేశానికి కట్ ఆఫ్ ఎంత?**

ప్రభుత్వ కళాశాలలో BAMS చదవాలంటే NEET UGలో 550 కంటే ఎక్కువ స్కోరు అవసరం. SC/ST కేటగిరీ విద్యార్థులకు దాదాపు 440 మార్కులు అవసరం. జనరల్, OBC, SC కేటగిరీలకు కటాఫ్ భిన్నంగా ఉంటుంది.

**BAMS చేసిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగం ఎలా పొందాలి?**

BAMS పూర్తి చేసిన తర్వాత అభ్యర్థులు ప్రభుత్వ ఉద్యోగాలు కూడా చేయవచ్చు. మెడికల్ ఆఫీసర్, ఆయుర్వేద స్పెషలిస్ట్, రీసెర్చ్ ఆఫీసర్ వంటి ప్రభుత్వ ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి. దీని కోసం BAMS డిగ్రీ అవసరం. నివేదికల ప్రకారం, మెడికల్ ఆఫీసర్ పోస్టులకు ప్రారంభ జీతం నెలకు రూ. 25,000 – 60,000. కానీ ప్రభుత్వ ఆసుపత్రులలో జీతం నెలకు రూ. 30,000 – 70,000 ఉంటుంది. అనుభవంతో జీతం పెరుగుతుంది.

టుడే వారధి

# ఆహా ఏమిరుచి.. గుమ్మడి ఇగురు కూర ఇలా చేస్తే ఇక మీరు..

తెలుగు వంటలు

దండిగా వండి గొప్ప పసిండగరిటె
వేఁడివేఁడి, వడ్డించె వేఁడివేఁడి,
నాతి కూష్మాండఖండ కాండంబు లొకతె”
దామరల వెంగళ భూపాలుడు తెలుగు వంటకాలను అత్యధికంగా ప్రస్తావించిన ‘బహులాశ్వచరితం’లో పద్యం ఇది. చింత పండు, మిరియాలపొడి, ఉప్పు, బెల్లం కలిపి దండిగా మగ్గించిన గుమ్మడికాయ ఇగురు కూరని వేడివేడిగా వేడి వేడి, బంగారు గరిటెతో వడ్డించారట!

మనిషి శాకాహారానికి అలవాటు పడ్డాక మొదటగా వండుకున్నది ఇగురు కూరనే! కొన్ని వేల ఏళ్ళ ప్రాచీనత ఇగురుకూరకు ఉంది! ఒక్కో ఆహార ద్రవ్యం రుచిని తెలుసుకుంటూ, వాటితో ఇగురుకూరలు వండుకుంటూ వచ్చాడు మనిషి! కానీ, ఇప్పట్లా అమితంగా అల్లం వెల్లుల్లి పేస్టు, నూనె, చింతపండు అధిక రసగతాలను మేళవించకుండా సహజంగా వండిన ఆరోగ్యకరమైన కూర ఇగురుకూర.

రాయలవారు ఆముక్తమాల్యదలో “ముకు మందై యేర్చు నావం జిగుర్కొను పచ్చళ్లు” అంటూ, ఇగురుకూరలో కొద్దిగా ఆవపిండి కలిపితే దానిఘాటుకు జలుబు నీళ్ళు వదిలి పోయి, ముక్కుమందులా పనిచేస్తుందని చెప్పాడు. క్రీడాభిరామంలో వల్లభరాయుడు ‘ఇగురావకూర’ గురించి ప్రస్తావించాడు. ‘తరుణం సర్షపశాకం’ అనే ప్రయోగాన్ని బట్టి ఆవకూర అంటే లేత ఆవ ఆకులతో వండిన కూర అని, ఉత్తరాదివారు రోటీల్లో నంజుకోవటానికి ఆవాకుల కూర వాడతారనీ ఆచార్య తిరుమల రామచంద్ర రాశారు. కానీ, ఆవాకులతో కూర వండే అలవాటు తెలుగు వారికి ఏనాడూ లేదు. అవి వాతం చేస్తాయని భోజనకుతూహలం గ్రంథం పేర్కొంది!

ఈ పద్యంలో గుమ్మడికాయ కూరనిదండిగా అంటే ఇగురించి వండినట్టు పేర్కొన్నారు. తడంతా పోయి, కూరమెత్తగా దగ్గర కొచ్చేదాకా మగ్గించింది ఇగురుకూర! తాలింపు కూర అనీ పిలుస్తారు. ఒక కిలో కూరగాయ ముక్కలకు రెండు టేబుల్ స్పూన్ల నూనె (30 ఎం.ఎల్) సరిపెట్టాలి!

‘ఇగ్.. చిగ్’ అని రెండు మూలద్రావిడ ధాతువులున్నాయి. ‘ఇగ్’ లోంచి ఇగురు (ఇగిరి పోవటం, మొగ్గ తొడగటం), ‘చిగ్’ లోంచి చిగురు (మారాకు వేయటం) ఏర్పడ్డాయి. తెలుగులో ఇగురుని కన్నడంలో ‘ఇగరు’ అంటారు.

“ఒకరికి ఇగురుకూర ఇష్టం, ఒకరికిపులుసు కూర ఇష్టం”గా కాకుండా మనుషులు ఐకమత్యంగా ఉండాలని సామెత. మిరప కాయలు మనకు పరిచయం అయ్యేవరకూ పులుసు కూరలు విందు భోజనాలకే పరిమితంగా ఉండేవి. తమిళంలో పోరియల్, కన్నడంలో పల్య, మలయాళంలో ‘పురట్టి’, తెలుగులో పొరటు, హిందీలో ‘సబ్‌జీ’ ఇలా ఇగురుకూర్లని పిలుస్తారు.

దుంపకూరలు, ములక్కాడల్లాంటి కఠిన పదార్థాల్ని నీళ్ళలో ఉడికించి, తర్వాత కొద్దిగా నూనె వేసి మగ్గబెట్టాలి. వంకాయ, బెండకాయ లాంటి కూరల్ని ఉడికించకుండానే మగ్గబెట్ట వచ్చు! ఎక్కువగా నీరుండే బీర, సొర, పొట్ల, కాకర, దొండ లాంటి కూరగాయల్ని ఉప్పు వేసి పిసికి నీరు పిండేసి తక్కువ నూనెలో మగ్గబెట్టాలి.

కోమలమైన ఒక ఆడపిల్లని ‘ఇగురుబోడి’ అన్నట్టే, కూరగాయల కోమలత్వం చెడకుండా వండే కూరని ఇగురుకూర అంటారు. నీరు ఇగిరేలా వండాల్సిన ఇగురు కూరని నీళ్ళు పోసి హొటళ్ళవాళ్లు కేటరర్లు అశాస్త్రీయంగా వండు తున్నారు. ఇగురు కూరని ముద్దకూరగా వండుకుంటే, ఎక్కువ కూర, తక్కువ అన్నం కమ్మగా తినటానికి అనువుగా ఉంటుంది!



భాండీలో రెండు చెంచాల నూనె వేసి ఇంగువ, తాలింపు గింజలు, మిర్చి, కరివేపాకు వగైరా వేగించి, ఎర్రగుమ్మడి కాయముక్కల్ని అందులో వేసి నీళ్ళ మూతబెట్టి కాసేపు మగ్గ నిచ్చి, అందులో తగినంత చింతపండు రసం, ఉప్పు, కొబ్బరి, కొత్తిమీర, రెండు బెల్లంముక్కలు కూడా వేసి ఇంకొంచెం మగ్గనిస్తే అదే గుమ్మడి కాయ ఇగురుకూర! చరిత్రకందని వేలయేళ్ల నాటి తెలుగు కూర ఇది. విందు భోజనాలకు ఆనాడూ గుమ్మడి ఇగురుకూర ప్రసిద్ధి! ఎర్ర గుమ్మడినీ, బూడిదగుమ్మడినీ దిష్టి తీయటానికి తప్ప కూరగాయగా వండుకోవటం మరచిన తెలుగువారికి ఈ పద్యం ఓ గమనింపు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006